మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 11 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | మంగళవారం • 8-1-2019 | www.manamnews.com | /manamnews



తెలంగాణ మంత్రివర్గ తొలి సమావేశం

సీఎం అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీకి హాజరైన హోంమంత్రి, ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు

- స్టీఫెన్‌సన్‌కు మరోసారి మండలి సభ్యత్వం
- గంగా జమునా తహజీబ్‌కు నిదర్శనం..
- ఎమ్మెల్యేల కోసం అసెంబ్లీ రూల్స్ బుక్స్ రెడీ
- ఎన్నికల ప్రశాంత నిర్వహణకు గానూ సీఈఓ, ప్రభుత్వ అధికారులకు అభినందన

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ప్రగతి భవన్‌లో సోమవారం జరిగింది. చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా.. ఎన్నికైన సభ్యులతో పాటు ప్రమాణ స్వీకారం చేయడానికి వీలుగా అసెంబ్లీ నామినేటెడ్ సభ్యుడి నియామకం జరపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సాధారణంగా నామినేటెడ్ సభ్యుడి నియామకంలో జాప్యం జరుగుతుంది. దీని వల్ల నామినేటెడ్ సభ్యుడు ఇతర సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేయడం సాధ్యపడదు. ఫలితంగా విలువైన పదవీ కాలాన్ని కోల్పోతారు. ఈ సమస్యను నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం తన మొదటి మంత్రివర్గ సమావేశంలోనే అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడి నియామకానికి నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో గంగా జమునా తహజీబ్‌ను కొనసాగించడానికి ప్రభుత్వం అసెంబ్లీకి మిగతా 2లో..

ఇద్దరితో మంత్రివర్గ సమావేశం

దేశంలోనే సరికొత్త రికార్డు

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి):

ముఖ్యమంత్రి కేసీఆర్ సరికొత్త రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఎన్నడూ ఇలాంటి రికార్డు నమోదు కాలేదు. దేశంలో కూడా అలాంటి దాఖలాలు లేవు. కేవలం ఇద్దరితోనే తొలిసారి మంత్రివర్గ సమావేశం నిర్వహించిన ఘనత, రికార్డు కేసీఆర్‌కే దక్కింది. ముందస్తు ఎన్నికల్లో అప్రతిహత విజయాన్ని దక్కించుకున్న కేసీఆర్ తనతో పాటు కేవలం ఒకే ఒక్కరు మహమూద్ అలీకి మాత్రమే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అరుదైన అవకాశం మిగతా 2లో..



అగ్రవర్ణ పేదలకూ కోటా!

నరేంద్రమోదీ సర్కారు సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 7:

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన అమ్ములపొదిలోని బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీశారు. విద్య, ఉద్యోగావకాశాలలో అగ్రవర్ణ పేదలకు కూడా 10% రిజర్వేషన్ కల్పించాలని తలపెట్టారు. ఈ మేరకు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల కోటాను 50 శాతం నుంచి మిగతా 2లో..

- విద్య.. ఉద్యోగాల్లో రిజర్వేషన్
- రిజర్వేషన్ల కోటా 10% పెంపు
- 50 నుంచి 60 శాతానికి కోటా
- రాజ్యాంగ సవరణకు మోదీ సై
- నేడు పార్లమెంటు ఎదుట బిల్లు
- ఎన్నికల ముంగిట... బ్రహ్మాస్త్రం
- ప్రతిపక్షాలకు అందని వ్యూహం
- అడ్డుకుంటే ఓటుబ్యాంకు గండి
- న్యాయ సమీక్ష జరిగే అవకాశం

రిజర్వేషన్లు పొందడానికి అర్హతలివే

రూ.8 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారు
5ఎకరాలకు మించని వ్యవసాయ భూమి ఉన్నవారు
వెయ్యి చదరపు అడుగుల లోపు ఇల్లు ఉన్న వారు..
నోటిఫైడ్ మున్సిపాలిటీలో 100 గజాలకు మించని స్థలమున్న వారు
నాన్ నోటిఫైడ్ మున్సిపాలిటీ ప్రాంతంలో 200 గజాలలోపే ఉండాలి

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం; తిథి: శుక్లపక్షం విదియ ఉ.9.42 వరకు; తదుపరి: తదియ; నక్షత్రం: శ్రవణం రా.10.03 వరకు; తదుపరి: ధనిష్ఠ; వర్జ్యం: రా.2.23 నుంచి 4.12 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.47 నుంచి 9.33 వరకు; తదుపరి: రా.10.47 నుంచి 11.41 వరకు; రాహుకాలం: ప.3.00 నుంచి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; అమృతఘడియలు: ఉ.10.28 నుంచి 11.56 వరకు;

వాతావరణం



మంగళవారం తెలంగాణలో వాతావరణం చాలావరకు పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి, చలిగాలులు కొనసాగుతాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు
గాలి వేగం: గంటకు 11కి.మీ.

ఉత్తమ్ టికెట్లు అమ్ముకున్నడు

ఓటమికి బాధ్యతగా ఆయన రాజీనామా చెయ్యాలె

- టీఆర్ఎస్‌తో కుమ్మక్కై కాంగ్రెస్‌ను పండబెట్టిండు
- కేసీఆర్ అన్నట్లు కాంగ్రెస్ నేతలు ఇడియట్లే..
- నన్ను సస్పెండ్ చేసే అధికారం టీపీసీసీకి లేదు
- ఎవరినీ వదిలిపెట్టను.. వారి భరతం పడ్త..
- కుంతియా హఠావో.. కాంగ్రెస్ బచావో..
- తమ పార్టీ నేతలపై సర్వే సత్యనారాయణ ఫైర్



హైదరాబాద్, జనవరి 07 (మనంప్రతినిధి):

సీఎం కేసీఆర్ అన్నట్లు కాంగ్రెస్ నాయకులు ఇడియట్లేనని కేంద్ర మాజీ మంత్రి సర్వేసత్యనారాయణ సమర్థించారు. రాష్ట్రంలో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మిగతా 2లో..

రిజర్వేషన్ల నిర్ణయంపై స్పందనలు..

వ్యతిరేకించిన ఆర్ కృష్ణయ్య



ఆచితూచిన కోదండరామ్..



50 శాతానికి మించొద్దన్న ఒవైసీ



హర్షం వ్యక్తం చేసిన లక్ష్మణ్



2లో..

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఒక్క బీజేపీ హర్షం వ్యక్తం చేయగా, బీసీ నేత ఆర్ కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ కోదండరామ్ 'నిర్ణయం మంచిదే, కానీ సాధ్యమయ్యే పని కాద'న్నారు. అసదుద్దీన్ ఒవైసీ రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీల్లేదు' అని అన్నారు.



బాహుబలి

- 7 దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయం
- చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన
- సిరీస్ ఆద్యంతం అన్నివిభాగాల్లో రాణించిన టీమిండియా
- డ్రాగా ముగిసిన చివరి టెస్టు
- నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం

వివరాలు స్పోర్ట్స్‌లో..

ఏడు దశాబ్దాల కరువు తీరింది. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి టీమిండియా చరిత్ర సృష్టించింది. మునుపటి భారత జట్ల కంటే ఇది ఉత్తమమైందన్న టీమిండియా కోచ్ వ్యాఖ్యలు నిజమయ్యాయి. నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఒకసారి తడబడినా తర్వాత పుంజుకుని అందివచ్చిన అవకాశాన్ని కోహ్లీ సేన సద్వినియోగం చేసుకుంది. ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునేలా చేసింది. కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా సాధించిన ఈ అపూర్వ సిరీస్ విజయం భారత క్రికెట్ చరిత్రలో కలకాలం నిలిచిపోతుంది.



స్టీఫెన్‌కి ఇచ్చే గిఫ్ట్ ఓటుకు నోటు కేసుకు పార్ట్-2 సినిమాలా ఉంది గురూ!



పోలియో బాధిత బాలునికి కేటీఆర్ భరోసా

వైద్యానికయ్యే ఖర్చును భరిస్తానని అభయం

తక్షణమే శివసాయిని ఆస్పత్రిలో చేర్పించాలని టీఆర్ఎస్ నేతకు ఆదేశం


హైదరాబాద్,జనవరి 07, (మనం ప్రతినిధి):

పోలియో వ్యాధితో రెండు కాళ్ళు దెబ్బతిన్న రామగుండం నియోజక వర్గం బాలుడు శివసాయికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామా రావు భరోసా ఇచ్చారు. తక్షణమే శివసాయిని ఆస్పత్రిలో చేర్పించాలని గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ నేత కట్టెల శ్రీనివాస్ యాదవ్ ను కేటీఆర్ ఆదేశించారు. ఆ బాలుడి వైద్యానికయ్యే ఖర్చును మిగతా 2లో..

ఎందుకు.. ఎలా?

డ్రైవింగ్ లైసెన్సుతో ఆధార్ లింకు.. దాంతో దొంగ వాహనాల ఆటకట్టు

డూప్లికేట్ లైసెన్సులు ఇక అసాధ్యం.. రెండూ లింకు చేసుకోవడం సులభమే



న్యూఢిల్లీ, జనవరి 7:

త్వరలోనే డ్రైవింగ్ లైసెన్సును ఆధార్‌తో లింక్ చేసుకోవడాన్ని తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన ప్రకటన చాలామందిలో ప్రకంపనలు పుట్టించింది. ఆధార్ సవరణ చట్టాన్ని లోక్‌సభ ఇప్పటికే ఆమోదించింది. రాజ్యసభలో కూడా అది ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడితే ఇక అది అమలులోకి వస్తుంది. డ్రైవింగ్ లైసెన్సుకూ ఆధార్ లింకేజా.. ఎందుకు అని ప్రశ్నిస్తున్నవారికి అనేక సమాధానాలున్నాయి. ప్రధానంగా మిగతా 2లో..



రక్షణ మంత్రివి అబద్ధాలు

హాల్‌కు లక్ష కోట్లు ఇవ్వలేదు

పార్లమెంట్‌లో అసత్యాలు చెప్పారు

5



లక్ష కోట్ల కాంట్రాక్టులు నిజమే

నేను చెప్పినదంతా అక్షర సత్యం

హెచ్ఏఎల్ కూడా నిర్ధరించింది

రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

తెలంగాణ మంత్రివర్గ తొలి సమావేశం



(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రొటెమ్ స్పీకర్‌గా ముస్లిం వర్గానికి చెందిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమించింది. అసెంబ్లీ నామినేటెడ్ సభ్యుడిగా క్రిష్టియన్ మతానికి చెందిన ఆంగ్లో ఇండియన్ ఎల్విస్ స్టీఫెన్ సన్ ను నియమించాలని సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. దీనికి సంబందించి గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే గెజిట్ విడుదల అవుతుంది. చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యం ఉండాలనే రాజ్యాంగ నిబంధన మేరకు తెలంగాణ అసెంబ్లీలో ఈ నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2018 డిసెంబర్ నెలలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించినందుకు భారత ఎన్నికల సంఘాన్ని మంత్రివర్గ సమావేశం అభినందించింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్ కుమార్‌ను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా మంత్రివర్గం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సమావేశానికి హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. శాసనసభ సమావేశాలు, ఆంగ్లో ఇండియన్ శాసనసభ్యుని నామినేట్ చేయడం, పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలు, తదితర అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది.

సభ్యులకు రాజ్యాంగం, అసెంబ్లీ నిబంధనల ప్రతులు

తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికైన శాసనసభ్యులకు భారత రాజ్యాంగం ప్రతులను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో , అసెంబ్లీకి సంబంధించిన వివిధ నిబందనల పుస్తకాలను, బుక్‌లెట్లను, ఇతర సమాచారాన్ని అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతులను అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చూపించారు.

ఇద్దరితో మంత్రివర్గ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించారు. ఆయనకు ఆ తర్వాత హోంమంత్రిత్వ శాఖను కేటాయించారు. దీంతో ముఖ్యమంత్రితో కలుపుకొని తెలంగాణ మంత్రివర్గం సంఖ్య రెండుకు మించలేదు. ఒక ముఖ్యమంత్రి, మరో హోంమంత్రితోనే తొలి మంత్రివర్గ సమావేశం జరగడం దేశంలోనే సరికొత్త రికార్డు అని అంటున్నారు. ఇద్దరితో మంత్రివర్గ సమావేశాలు జరిగిన దాఖలాలు గతంలో ఎన్నడూ లేవంటున్నారు. శాసనసభ సమావేశాల నిర్వహణకు ఆమోదంతో పాటు మరి కొన్ని కీలక నిర్ణయాలు ఈ సమావేశంలో తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇంత వరకూ మంత్రివర్గ విస్తరణ జరగలేదు. మంచి రోజులు లేవనే కారణంతో మంత్రివర్గ విస్తరణను వాయిదా వేస్తున్నారని టీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నందున పరిమిత స్థాయిలో అయినా మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని ఆశావాహులు ధీమాతో ఉన్నారు. అయితే ఎప్పుడు అనేది తేలాల్సి ఉంది. ఎక్కువ మంది ఈ నెల 18న మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని అంటున్నారు. మొత్తానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఇద్దరితోనే మంత్రివర్గ సమావేశం నిర్వహించి నూతన చరిత్ర సృష్టించారు. అసెంబ్లీ నిర్వహణలో సభా వ్యవహారాల మంత్రి పాత్ర కీలకం అవుతుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపాల్సి ఉంటుంది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందే పరిమితమైన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందంటున్నారు. ప్రొటెం స్పీకర్ ఎంపిక పూర్తయినందున, స్పీకర్ పదవి విషయంలో త్వరలోనే స్పష్టత వస్తుందని అంటున్నారు.

10 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర నేతలు స్పందనలు

ఊరుకోం.. ఆందోళనలు చేస్తాం : ఆర్ కృష్ణయ్య హెచ్చరిక



అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్ల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని బీసీ నేత ఆర్.క ష్ణయ్య అన్నారు. ఇష్టమొచ్చినట్టుగా రిజర్వేషన్లు ఇస్తామంటే కుదరదని, అరవై శాతంకి రిజర్వేషన్లు పెంచుతామంటే ఊరుకోమని, కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్ర మోదీకి దమ్ముంటే దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీలకు 53 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

మంచిదే..కానీ సాధ్యం కాదు : కోదండరామ్



అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ స్పందించారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ నిర్ణయం మంచిదే కానీ సాధ్యమయ్యే పని కాదని అభిప్రాయపడ్డారు.


రాజ్యాంగంలోని నిబంధనలు ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి ఇబ్బందేనని, రాజ్యాంగ సవరణ చేస్తే చేయొచ్చు కానీ, ఇప్పటికిప్పుడు ఇది సాధ్యమయ్యే పని కాదని అన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లపై రాష్ట్రాల అభిప్రాయం కూడా తీసుకోవాలని, ఇది అమలు చేయాలంటే మూడు నెలల సమయం సరిపోదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని, ఈబీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఈ నాలుగేళ్లు ఏం చేశారని ప్రశ్నించారు.

50 శాతానికి మించరాదు : ఒవైసీ



'దళితులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిచేసేందుకు రిజర్వేషన్లను తీసుకొచ్చారు. పేదరికాన్ని అరికట్టడానికి చాలా పథకాలు, కార్యక్రమాలు తీసుకునిరావొచ్చు. కానీ రిజర్వేషన్లు అన్నవి న్యాయానికి ఉద్దేశించినది. ఆర్థిక కారణాల ఆధారంగా రాజ్యాంగం రిజర్వేషన్లను ఇవ్వలేదు' అని తేల్చిచెప్పారు. ప్రస్తుతం కేంద్రం 49.5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ రిజర్వేషన్లు 50 శాతం దాటేందుకు వీలులేదు.

హర్షం వ్యక్తం చేసిన లక్ష్మణ్



కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా. కే.లక్ష్మణ్ అన్నారు. అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాత రిజర్వేషన్లు కల్పించడం వల్ల అందరికీ సమాన అవకాశాలు కలుగుతాయన్నారు. గతంలో ఎన్డీఏ నేత త్వంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం కమిషన్ వేసింది. తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ నేత త్వంలోని యూపీఏ ప్రభుత్వం కమిషన్ను పరిశీలించకుండా పక్కన పెట్టింది. ఈబీసీ రిజర్వేషన్ ను 10 శాతం పెంచడం ద్వారా రిజర్వేషన్ల శాతం పెరగనుంది. సుప్రీంకోర్టు ఇటీవల 50 శాతం మించకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ రిజర్వేషన్ల పెంపు ద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశం ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈబీసీల కోసం తీసుకున్న నిర్ణయంతోనైనా రాష్ట్రంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీకి, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు కనువిప్పు కలగాలి. కేసీఆర్ బీసీ రిజర్వేషన్లను కుదించి బీసీలకు అన్యాయం చేశారు. బీసీ రిజర్వేషన్లను ఆదరబాదరగా కుదిస్తూ ఆర్డినెన్సు తీసుకురాకున్నట్లయితే బీసీలకు న్యాయం జరిగేది. యధావిధిగా 34 శాతం రిజర్వేషన్లు కొనసాగేలా కేసీఆర్ చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు.

పోలియో బాధిత బాలునికి కేటీఆర్ భరోసా

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ తానే భరిస్తానంటూ అభయమిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్ లో కేటీ రామారావును ఎమ్మెల్యే చందర్ తో పాటు కలిసి శివసాయి తన సమస్యను వివరించారు.

ఉత్తమ్ టికెట్లు అమ్ముకున్నడు



(మొదటిపేజీ తరువాయి)

తన పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లోఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతియా, ఉత్తమ్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎఐసీసీ సభ్యుడినైన తనను సస్పెండ్ చేసే అధికారం ఉత్తమ్‌కు లేదన్నారు. తనకు సస్పెన్షన్ ప్రతి అందలేదని, ఉత్తమ్‌తో ఉంటే చూపించాలని సవాల్ చేశారు. తన సస్పెన్షన్ మీడియా ద్వారానే తెలిసిందన్నారు. తన సస్పెన్షన్ పై త్వరలో అధిష్టానాన్ని కలుస్తానని చెప్పారు. తనను తప్పించిన వారిని వదిలే ప్రసక్తిలేదని, వారి భరతం పడతానని హెచ్చరించారు. ఓటమికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాల్సింది పోయి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పార్టీలో చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. ఉత్తమ్ వల్లే పార్టీ ఓడిపోయిందని మెజారిటీ నాయకులకు ఉందని, ఉత్తమ్ ..., కుంతియా హఠావో ...,కాంగ్రెస్ బచావో అని నినాదాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాల్సి ఉందన్నారు. 2014 ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ నాటి పీసీసీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య తన పదవికి రాజీనామా చేశారని, ఉత్తమ్ ఇంకా పదవి పట్టుకుని వేలాడుతున్నారని సర్వే సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తాను గెలిస్తే సీఎం అవుతానని తనను ఓడించేందుకు ఉత్తమ్ ప్రయత్నించారని, అదే విధంగా మల్లు భట్టి విక్రమార్కను కూడా ఓడించేందుకు శతవిధాలా ప్రయత్నించారని తీవ్రమన ఆరోపణలు సంధించారు. కోదాడ, కొల్లాపూర్, పాలేరు, హుజురాబాద్ తదితర నియోజకవర్గాల టికెట్లను ఉత్తమ్ అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో గూడూరు నారాయణరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాటి రాష్ట్ర ఇంచార్జీ దిగ్విజయ్ సింగ్ సమక్షంలోనే కొట్టుకున్నారని వారినెందుకు సస్పెండ్ చెయ్యలేదని ప్రశ్నించారు. తాను గరీబోన్నయినందుకే సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఉత్తమ్, కుంతియాను చూసి ప్రజలు ఓట్లేయలేదని, కాంగ్రెస్ చరిత్రను చూసి ఓట్లేశారని గుర్తు చేశారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చెయ్యాలి ప్రజలు అనుకున్నారని, వారి ఆశలను ఉత్తమ్, కుంతియా వమ్ము చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు కేసీఆర్ అప్పుడే రంగం సిద్ధం చేసుకుంటుంటే ఈ నేతలు సమీక్షల పేర కాలయాపన చేస్తున్నారని, అసలు సమీక్షలు పెట్టాలని ఎఐసీసీ చెప్పిందా ? టీఆర్ఎస్‌తో కుమ్మక్కై రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నాశనం చేస్తున్న ఉ త్తమ్‌కుమార్ రెడ్డిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాను గాంధీ కుటుంబానికి విధేయుడినని, సోనియా, రాహుల్ దయవల్లే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేశారు. టీఆర్ఎస్‌తో ఉత్తమ్ కుమ్మక్కయి కాంగ్రెస్‌ను పండబెట్టారని, కేసీఆర్‌తో ఇప్పటికీ లాలూచీ పడుతున్నారని మండిపడ్డారు. నిన్న తనపై జరిగిన దాడికి సంబంధించి ఉత్తమ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తాను తొలుత అరచిన మాట వాస్తవమేనని, ఉత్తమ్ పెంచి పోషించిన చెంచాగాళ్లతో దాడి చేయించారని విమర్శించారు. తనకు కూడా అన్ని హంగులున్నాయని, తనపై కొట్టడానికి పంపిన వారిని వదిలే ప్రసక్తిలేదన్నారు. చంద్రబాబు, కోదండరాం గొప్ప నాయకులని వారిని కూడా ఉత్తమ్, కుంతియాలు అవమానించారని తెలిపారు. కూటమి పేర గోల్కొండ హోటల్, పార్క్‌హోటల్, గోల్కొండ రిసార్టులలో తూతూ మంత్రంగా సమావేశాలు జరిపి పార్టీని నట్టేట ముంచారని తెలిపారు. రేపు నామినేషన్ అనగా టికెట్లిస్తారా? ఇబ్రహీంపట్నం టీడీపీ పొత్తులో పోయింది ..అక్కడ బీఎస్పీ తరపున పోటీ చేసిన మల్ రెడ్డి రంగారెడ్డికి ఎలా మద్దతిస్తారని ప్రశ్నలు కురిపించారు.ఎమ్మెల్సీలు పోతే పట్టించుకోవు. 13 మంది ఎమ్మెల్యేలు పోవడానికి సిద్దంగా ఉన్నారట వారు పోకుండా ఏమైనా చర్యలు తీసుకున్నావా అని ఉత్తమ్‌పై మండిపడ్డారు. పీసీసీ ఆయనే, సీఎల్పీ నేత కూడా ఆయనేనట అందుకే ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి వెళుతున్నారని సర్వే సత్యనారాయణ వివరించారు.

మీడియా ముందుకు అలోక్‌నాథ్

ముందస్తు బెయిల్ ఇచ్చిన కోర్టు

భార్యకు కృతజ్ఞతలు తెలిపిన నటుడు

ముంబై, జనవరి 7: కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో సుదీర్ఘ కాలం తర్వాత నటుడు అలోక్‌నాథ్ తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ప్రస్తుతానికి పూర్తి మౌనంగా ఉండాలని కోర్టు, తన న్యాయవాదులు తనకు తెలిపారని, అందువల్ల ఇప్పటికేమీ మాట్లాడలేనని అన్నారు. అయితే ఇంతకాలం తనకు మద్దతుగా నిలిచిన తన భార్య ఆషుకు మాత్రం కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లూ కూడా తాను ఏమీ మాట్లాడలేదని, అయితే ఆవేదనలో ఒకటి రెండు మాటలు తన నోటి నుంచి జారిపోయాయని అన్నారు. గత మూడు నెలలుగా తాను ఒక్క మాట కూడా మాట్లాడకుండానే ఉండిపోయానని చెప్పారు. రచయిత్రి-దర్శకురాలు వింతా నందా దాఖలుచేసిన అత్యాచారం కేసులో ఆయనకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తాను మాట్లాడగలిగే పరిస్థితి వచ్చినపుడు తప్పనిసరిగా మనసు విప్పి మాట్లాడతానన్నారు. తన భార్య ఈ విషయంలో తనకు ఎంతో అండగా నిలిచిందని, తన జీవితయానంలో తన సహ ప్రయాణికురాలిగా ఆమె ఉన్నందుకు దేవుడికి ఎంతో కృతజ్ఞుడినై ఉంటానని అలోక్‌నాథ్ తెలిపారు. ఆమె ఎప్పుడూ తనతోనే ఉందని, నిజానిజాలేంటో దేవుడికే తెలుసని అన్నారు. అందుకే దేవుడికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కోర్టు ఉత్తర్వుల ఆధారంగా తన తదుపరి న్యాయపోరాటం ఉంటుందన్నారు. ప్రస్తుతం తానేమీ చెప్పలేనని, అయితే కోర్టులో న్యాయపోరాటం తర్వాత నిజానిజాలు బయటకు వస్తాయని చెప్పారు.

నోట్ల రద్దు.. తుగ్లక్ చర్య

ఏలూరు, జనవరి 7 (మనం న్యూస్ బ్యూరో): పెద్దనోట్ల రద్దు పిచ్చితుగ్లక్ చర్య అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. 2వేల నోట్లు ప్రవేశపెట్టి.. ఎన్నికల్లో టన్నుల కొద్దీ డబ్బు ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ తనపై అక్కసుతోనే విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా కాలయాపన చేశారని.. తాము మూడుసార్లు ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఒత్తిడి తేవడం ఆయనకు కోపం తెచ్చిపెట్టిందన్నారు. తాను ఎన్టీఆర్‌ను మోసం చేశానని మోదీ అంటున్నారని.. అసలు ఆయనకు ఎన్టీఆర్ గురించి మాట్లాడే హక్కే లేదని చంద్రబాబు అన్నారు. ఎవరైనా ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై సీబీఐ దాడులు చేయించి బెదిరింపులకు దిగుతున్నారన్నారు. విభజించు, పాలించు పాలనను మోదీ అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌పై ఒక కేసు ఉంటే ఆధారాలు లేవని కొట్టేయించిన వ్యక్తి మోదీ అని ఆయన పేర్కొన్నారు. తన కుమారుడు లోకేశ్ చదువు తరువాత ఆయన వ్యక్తిగత అభిప్రాయాల మేరకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. దీనిని కూడా మోదీ విమర్శించి.. తమ కుటుంబాన్ని కూడా రోడ్డు మీదకు తీసుకొస్తున్నారన్నారు. ప్రధాని అవ్వాలని అనుకుంటే ఎప్పుడో అయ్యేవాడినని, అయితే ఆ కోరిక తనకు లేదని తెలిపారు. అన్ని పార్టీలను కలుపుకొంటే తప్ప రాష్ట్రానికి న్యాయం జరగదన్నారు. రాష్ట్రంలో 2022 నాటికి అందరికీ సొంత ఇళ్లు సమకూర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. 2022 నాటికి ప్రతీ ఒక్కరికి సొంత ఇళ్లు నిర్మించే బాధ్యత తానే తీసుకొంటానన్నారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఏప్రిల్ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవల పరిమితిని 5 లక్షలకు పెంచబోతున్నామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇబ్బందుల్లో ఉన్నా.. రూ. 24వేల కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. మరో 10వేల కోట్ల రూపాయలు ఆడపడుచులకు పసుపు, కుంకుమ కింద ఇచ్చామన్నారు. రాబోయేది నాలెడ్జి సొసైటీ అని, మన ఆర్టీజీఎస్‌ను చూసేందుకు ఇంగ్లాండ్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ వచ్చారంటే.. అది మన ఘనత అని చంద్రబాబు పేర్కొన్నారు.


గిన్నిస్‌లో పోలవరం

ఏలూరు, జనవరి 7(మనం న్యూస్ బ్యూరో): ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పనుల్లో సోమవారం ప్రపంచ రికార్డు ఆవిష్కృతమైంది. గతంలో చేపట్టిన 21,580 క్యూబిక్ మీటర్ల పనులను 16 గంటల్లోనే నవయుగ సంస్థ అధిగమించింది. 24 గంటల్లో 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసి గిన్నిస్ రికార్డుకెక్కింది. ప్రపంచ రికార్డు స్థాయిలో కాంక్రీట్‌ను నవయుగ సిబ్బంది డంప్ చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8గంటల వరకు నిరంతరాయంగా కాంక్రీట్ పోసి సరికొత్త రికార్డు సృష్టించారు. దీంతో పోలవరం పనుల్లో రికార్డు నమోదైనట్టు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రకటించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు వద్దే ప్రతినిధులు గిన్నిస్ రికార్డు సాధించిన ధ్రువపత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ప్రపంచ స్థాయి కాంక్రీట్ పనులలో గిన్నిస్ రికార్డు స్థాపించి గిన్నిస్ బుక్ ప్రతినిధుల చేతులమీదుగా అవార్డు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు కాంక్రీట్ పనుల్లో రికార్డు స్థాపించినందుకు పూజలు నిర్వహించి, పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టులో స్పిల్ చానల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రిషినాథ్ చేతులమీదుగా గుర్తింపు పత్రాన్ని చంద్రబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో ఎన్ని కార్యక్రమాలు చేసినా ఇప్పుడు పొందినంత ఆనందం మరెన్నడూ పొందలేదన్నారు. ఈ 4 గంటల్లో 3,100 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని విజయవంతంగా పూర్తి చేసినందుకు నవయుగ కంపెనీ, కార్మికులకు, ఇంజనీర్లకు, జలవనరుల శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నవయుగ కంపెనీ రానున్న మార్చి నెలలో ఇప్పుడు అధిగమించిన గిన్నిస్ రికార్డుని 65 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేసి అధిగమించాలని చంద్రబాబు సూచించారు.

అగ్రవర్ణ పేదలకూ కోటా!

(మొదటిపేజీ తరువాయి)

60శాతానికి పెంచేందుకు రాజ్యాంగ సవరణకు సైతం సిద్ధమవుతున్నారు. ఈ బిల్లును పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టేందుకు సర్వసన్నద్ధమయ్యారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో గట్టి ఎదురుదెబ్బ తగలడం, మరో నాలుగైదు నెలల్లోనే లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అగ్రవర్ణాల వారి ఓట్లను ఆకట్టుకునేందుకు మోదీ తన వద్ద ఉన్న పాచిక విసిరారు. ప్రత్యక్ష నియామకాలతో పాటు ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశాలకు అగ్రవర్ణ పేదలకు 10% కోటా కల్పించే బిల్లును కేంద్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదించినట్లు సమాచారం. రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదికన ఉండాలి తప్ప కుల ప్రాతిపదికన కాదన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సిద్ధాంతానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



ప్రతిపక్షాలకు చెక్

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టడం, దానికి తోడు ఇపుడున్న రిజర్వేషన్లను ఏమాత్రం ముట్టుకోకుండా రాజ్యాంగ సవరణకు వెళ్లేందుకు సిద్ధం కావడంతో ప్రతిపక్షలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెక్ పెట్టినట్లయింది. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించొద్దని ఏ పార్టీ అడ్డుపడే పరిస్థితి దాదాపు లేనట్లే. ఇలా చేయడం వల్ల వేరే వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఎవరైనా వాదిద్దాం అనుకున్నా.. ఇపుడున్న కోటాను ఏమాత్రం కదిలించడం లేదు. అదనంగా కోటా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ కూడా చేస్తామని చెబుతున్నారు. అందువల్ల ప్రతిపక్షాలు దీన్ని ఏ కారణం చెప్పి అడ్డుకోడానికీ అవకాశం లేకుండా పోయింది.


న్యాయ సమీక్షకు అవకాశం

అయితే, ప్రస్తుతమున్న రిజర్వేషన్ల వ్యవస్థలో ఏమాత్రం వేలు పెట్టాలన్నా.. ఇప్పటికున్న 50 శాతం పరిమితిని పెంచాలన్నా కూడా అది అంత సులభంగా అయ్యే పని కాదు. రాజ్యాంగ సవరణ అంటే సగానికి పైగా రాష్ట్రాలు సైతం దాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అదంత సులభంగా అవుతుందన్న నమ్మకం లేదు. దానికితోడు ఇది న్యాయసమీక్షకు కూడా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాలన్నా కూడా న్యాయనిపుణుల సలహాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇదంతా ఎలా ఉన్నా.. దీన్ని అమలు చేసేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని చూపించడం ద్వారా రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ లబ్ధి పొందేందుకు మాత్రం కావల్సినంత అవకాశం ఉంటుంది.

ఎందుకు.. ఎలా ?

(మొదటిపేజీ తరువాయి)

ఒక వ్యక్తి ఒక డ్రైవింగ్ లైసెన్సు మాత్రమే కలిగి ఉండాలని నిబంధనలున్నాయి. అయితే, ఎక్కడైనా ఒక రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు చేసినవాళ్లు వేరే రాష్ట్రానికి వెళ్లి అక్కడ నకిలీ పత్రాలతో వేరే డ్రైవింగ్‌లైసెన్సు తీసుకుని యథేచ్ఛగా వాహనాలు నడుపుతున్నట్లు ఇటీవలి కాలంలో తెలుస్తోంది. ఇలా రెండేసి, మూడేసి లైసెన్సులు తీసుకోవడం ఆధార్ లింకేజి ఉంటే అసాధ్యం. ఎందుకంటే.. ఎవరైనా వ్యక్తులు తమ పేర్లు మార్చుకోవచ్చు, ఆ పేర్లతో దొంగ సర్టిఫికెట్లు పుట్టించుకోవచ్చు, నివాస ధ్రువీకరణ కూడా తీసుకోవచ్చు. వాటన్నింటి ఆధారంగా డ్రైవింగ్ లైసెన్సు కూడా పొందే అవకాశం ఉంది. కానీ, ఒకసారి ఆధార్ లింక్ అయితే, డ్రైవింగ్ లైసెన్సు తీసుకునేటప్పుడు వేలిముద్ర వేయగానే.. మన ఆధార్ నంబరు, దానికి అనుసంధానం అయి ఉన్న పాత లైసెన్సుల నంబర్లు అన్నీ వచ్చేస్తాయి. అంతేకాదు.. సదరు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తి గతంలో ఏదైనా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా, ప్రమాదాలు చేసినా ఆ వివరాలు కూడా వచ్చేస్తాయి. దాంతో రెండోసారి లైసెన్సు ఇవ్వడం మాట అటుంచితే, ముందు పాత బకాయిలు వసూలు చేయడం.. తీవ్ర నేరాలైతే పోలీసులకు అప్పగించడం లాంటివి కూడా సాధ్యమవుతాయి.



గుర్తింపు సులభం

లైసెన్సు తీసుకున్నవారిని సులభంగా గుర్తించడం ఆధార్‌తో సాధ్యమవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ మీద ఉండే ఫొటో కూడా కొన్నాళ్లకు కనిపించకుండా పోతుంది. అలాంటి సందర్భంలో ఆధార్ నంబరు ఉంటే.. ట్రాఫిక్ పోలీసుల వద్ద, ఆర్టీయే వర్గాల వద్ద ఉండే ట్యాబ్‌లో వివరాలు వెంటనే తెలిసిపోతాయి. దాంతో మోసం చేయడానికి వీలుండదు.

జరిమానాల చెల్లింపు

ఆధార్ లింకు చేయడం వల్ల వాహనదారులు తాము కట్టాల్సిన జరిమానాలను కూడా వెంటనే కట్టేసేందుకు అవకాశం పెరుగుతుంది. ఇప్పటివరకు చాలామంది ఎక్కువకాలం పాటు ఫైన్లు కట్టకుండా అలా వదిలేస్తున్నారు, అవి మరీ ఎక్కువ మొత్తంలో పేరుకుపోతే వేరే కొత్త లైసెన్సు తీసుకుంటున్నారు. ఇప్పుడు ఆధార్‌తో లింకు చేయడం వల్ల అలాంటి సమస్యలు కూడా తీరుతాయి.

లింకు చేయడం ఎలా...

వివిధ రాష్ట్రాల రవాణా విభాగానికి చెందిన వెబ్ సైట్లలోనే ఆధార్ లింకేజికి కావల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. వెబ్‌సైట్ తెరిచిన తర్వాత.. అందులో లింక్ ఆధార్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్సు నెంబరు ఎంటర్ చేసి, 'గెట్ డీటైల్స్' అన్నదానిపై క్లిక్ చేయాలి. అక్కడ మీ వివరాలు వచ్చిన తర్వాత 12 అంకెల ఆధార్ నంబరును, దానికి అనుసంధానం అయి ఉన్న ఫోన్ నంబరును ఎంటర్ చేయాలి. అప్పుడు సబ్మిట్ మీద క్లిక్ చేస్తే పని పూర్తయిపోయినట్లే. మీ మొబైల్ నెంబరుకు ఆ విషయాన్ని నిర్ధరిస్తూ ఒక ఎస్ఎంఎస్ కూడా వస్తుంది.



పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యాక తొలి సారి ప్రధాన మంత్రి మోదీని కలిసిన టీఆర్ఎస్ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్

కలప స్మగ్లర్లపై పీడీ కేసులు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 7 (మనం ప్రతినిధి): కలప స్మగ్లింగ్‌కు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సహకారంతో కలప స్మగ్లర్‌పై ఉక్కుపాదం మోపాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. తరచూ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీచట్టం పరిధిలో కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.కలప స్మగ్లర్లు ఎంతటి వారైనా, ఎంత పలుకుబడి కలిగిన వ్యక్తయినా,ఏ రాజకీయ పార్టీకి చెందినా చర్యలు తీసుకోవలసిందేనని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను నాలుగు విభాగాలుగా విభజించుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలు పెంపకం, అడవి పునరుద్ధరణ, హైదరాబాద్ నగరం లోపలా, బయటా



పచ్చదనం పెంచడం, కలప స్మగ్లింగ్ అరికట్టడంపై కార్యాచరణ రూపొందించుకొని రంగంలోకి దిగాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ,అడవుల పెంపకంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి మహమూద్‌అలీతో పాటు పోలీసు,అటవీశాఖఅధికారులు పాల్గొన్నారు. అడవుల్లో సహజంగా చెట్లు పెరుగుతాయి. అడవుల ద్వారా లభించే పచ్చదనమే ఎక్కువ. ఓ వైపు అడవులు నశించిపోతుం టే,హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్నిచెట్లు పెంచినాపెద్దగా ప్రయోజనం ఉండదు. అడవులను కాపాడితే పచ్చదనం కాపాడినట్లే. అడవులను కాపాడటమంటే భూమి ధర్మాన్ని కాపాడినట్లే. కలప స్మగ్లింగ్ వల్ల అడవులకు పెద్ద ముప్పు వాటిల్లుతుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతుంది. కొందరు కలప స్మగ్లింగ్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. అలాంటి ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించాలి, అక్కడ నిబద్ధత కలిగిన



అధికారులను నియమించాలి, కలప స్మగ్లింగ్‌అరికట్టడమే లక్ష్యంగా అధికారులు అంతా సమన్వయంతోపని చేయాలి,పోలీసుల సహకారంతో అటవీశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించాలి, సాయుధ పోలీసుల అండతో కలప స్మగ్లింగ్‌ను నూటికి నూరు శాతం అరికట్టాలి, కలప స్మగ్లింగ్‌కు పాల్పడే వారు ఎవరైనా సరే ఉపేక్షించవద్దు, కఠిన చర్యలు తీసుకోవాలి, వారికి సహకరించే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలి అని ముఖ్యమంత్రి కేసీఆర్ అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు
బకాయిలు చెల్లించాలి

- కేసీఆర్‌తో సహా 33 మందికి లేఖలు

హైదరాబాద్, జనవరి 7(మనం ప్రతినిధి): ముందస్తు ఎన్నికల ప్రచా రంలో ఉపయోగించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాల బకాయిలు చెల్లించాలంటూ రాజకీయ నాయకులకు పోలీసుశాఖ లేఖలు పంపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ పార్టీలకు చెందిన 33 మంది ముఖ్య నేతలకు తాఖీదులు అందాయని పేర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి డిసెంబర్ 7 వరకు సీఎం కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి, మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులకు పోలీసు శాఖ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలతో భద్రత కల్పించారు. వాహనాలను వాడిన వారి జాబితాలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీజేపీ నాయ కుడు కిషన్‌రెడ్డి, మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఓవైసీ,తదితరులు వున్నారు. ఒకొక్క నాయకుడు రూ.57 వేల నుంచి 7.7లక్షల వరకు పోలీసు శాఖకు చెల్లించవలసి ఉంటుంది.

పోలియో బాధిత బాలునికి కేటీఆర్ భరోసా

- వైద్యానికయ్యే ఖర్చును భరిస్తానని అభయం
- తక్షణమే శివసాయిని ఆస్పత్రిలో చేర్పించాలని టీఆర్ఎస్ నేతకు ఆదేశం



హైదరాబాద్, జనవరి 07, (మనం ప్రతినిధి): పోలియో వ్యాధితో రెండు కాళ్ళు దెబ్బతిన్న రామగుండం నియోజకవర్గం బాలుడు శివ సాయికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భరోసా ఇచ్చారు. తక్షణమే శివసాయిని ఆస్పత్రిలో చేర్పించాలని గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ నేత కట్టెల శ్రీనివాస్ యాదవ్‌ను కేటీఆర్ ఆదేశించారు. ఆ బాలుడి వైద్యానికయ్యే ఖర్చును కేటీఆర్ తానే భరిస్తానంటూ అభయమి చ్చారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీ రామారా వును ఎమ్మెల్యే చందర్‌తో పాటు కలిసి శివసాయి తన సమస్యను వివరించారు.

సోమారపు మనోడే

- చందర్ మన సన్నిహితుడే
- తన మనసులో ఉన్నమాటను బహిర్గతం చేసిన కేటీఆర్
- మీరంతా సొంత గూటికి వచ్చిండ్రు
- రామగుండంలో చందర్ గెలవటం సంతోషకరం
- టీఆర్ఎస్‌లో చేరిన రామగుండం స్వతంత్ర్య ఎమ్మెల్యే

హైదరాబాద్,జనవరి 07, (మనం ప్రతినిధి): మీరంతా కొన్ని కారణాలతో పార్టీకి దూరంగా ఉన్నప్ప టికి ఎప్పటికీ కూడా ఉద్యమనేత, సీఎం కేసీఆర్ శిష్యు లేనని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో రామగుండం స్వతంత్ర్య ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కేటీఆర్ సమక్షంలో సోమవారం టీఆర్ఎస్‌లో చేరారు. ఈ చేరికల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సోమారపు, ప్రభుత్వ సలహాదారు వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మాట్లాడుతూ... మళ్లీ ఇప్పుడు మీరంత తిరిగి సొంత గూటికి వచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. రామగుండంలో కాంగ్రెస్ గెలవక పోవటం మన అదృష్టమని ఆయన చెప్పారు. అక్కడ మన సోదరుడు గెలవటం చాలా సంతోషకరమైన విషయమని హర్షంవ్యక్తం చేశారు. అయితే, ఒకవైపు సోమరపు మన పార్టీ లీడరని, ఇంకో వైపు చందర్ మన సన్నిహితుడేనని ఆయన చెప్పారు. ఇక,చందర్‌కు సతీ వియోగం కలిగిన రోజే, తాను సోమారపు ప్రచారానికి వచ్చానని..ఆ విషయంలో నేను బాధ పడ్డానని కేటీఆర్ ఈ సందర్భంగా తన మనసులో ఉన్న మాటను బహిర్గతం చేశారు. ఎప్పుడు ఎవరికి కూడా పదవులు శాశ్వతం కాదన్నారు.

సోమారపు సత్యనారాయణ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడని కేటీఆర్ తెలిపారు. అవసరం అయినప్పుడు సహకరిస్తనని సత్యనారాయణ చెప్పారని..ఇది అత్యంత పెద్ద మాట అని ఆయన అన్నారు. ఇక, చందర్ కూడా సలహాలు తీసుకోవాలన్నారు. ఇకనుంచి ఇద్దరూ కూడా పాత కక్షలు పక్కన పెట్టి కలిసి పని చేసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలా ఉంటే, రామగుండంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని కేసీఆర్ చెప్పారని.. త్వరలో ఆ హామీ నిలబెట్టుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. చందర్, సోమరపు సత్యనారాయణకు కలిసి లక్ష పైన ఓట్లు వచ్చాయని,వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఈ ఓట్లు మనకే పడాలన్నారు. ఇద్దరు కలిసి కట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలని వారికి సూచించారు. ఇక, ముఖ్యంగా టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని నిలబెట్టుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే,ఇకనుంచి మీ నియోజక వర్గ బాధ్యతలను నేను కూడా వ్యక్తిగతంగా తీసుకుంటానని చెప్తూ ఆ ఇద్దరు నేతలకు భరోసా కల్పించారు.

గతంలో ఎమ్మెల్యే సీటు ప్రజలు ఇచ్చేదని.. ఇప్పుడు రామగుండం సీటును ప్రజలు ఈ ఎమ్మెల్యేకు అప్పగించారని టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. కేసీఆర్‌కు సీఎం సీటు ఇచ్చింది కూడా ప్రజలేనన్నారు. అయితే, నేను ఓడిపోయినా బాధలేదన్నారు. రామగుండంలో కాంగ్రెస్ గెలువలేదని..టీఆర్ఎస్‌కు చెందిన చందర్ గెలవటం సంతోశించదగ్గ విషయమని.. ప్రజలిచ్చిన



విజయాన్ని హర్షిస్తున్నట్లు సోమారపు సత్యనారాయణ తెలిపారు. ఇకనుంచి చందర్ కు ఏ అవసరం వచ్చినా తాను సహకరిస్తానని ఆయన చెప్పారు. తెలంగాణలో ఎప్పుడు, ఏ ఎన్నిక వచ్చినా గెలిచేది టీఆర్ఎస్ పార్టీయేనని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీయే నా మాత సంస్థ అంటూ చందర్ భావోద్వేగానికి గురయ్యారు. అయితే, తనను టీఆర్ఎస్ పార్టీలో మళ్లీ చేర్చుకునేందుకు చాల సంతోషంగా ఉందన్నారు.

చందర్ చురుగ్గా ఉన్నారు : మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి...

మలిదశ తెలంగాణఉద్యమంలో చందర్‌అత్యంత చురుకుగా పాల్గొన్నారని మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సింగరేణి ఎన్నికల్లోనూ చందర్ టీఆర్ఎస్ ను గెలిపించారని ఆయన గుర్తుచేశారు.ఇకనుంచి అందరం కలిసి పార్టీనీమరింత బలోపేతం చేయాలని వివేక్ పిలుపునిచ్చారు.

దత్తాత్రేయవి గాలి మాటలు

- టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కర్నే ప్రభాకర్, ఫారూఖ్ హుస్సేన్

హైదరాబాద్,జనవరి 07, (మనం ప్రతినిధి): తెలంగాణ బిడ్డ అయిన మాజీ మంత్రి దత్తాత్రేయను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించినందుకు తాము చాలా బాధపడ్డామని టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కర్నే ప్రభాకర్ ,ఫారూఖ్ హుస్సేన్ పేర్కొన్నారు. అయిన ఆయనపై మాకు చాలా సానుభూతి ఉందన్నారు. కనీసం మంత్రి వర్గం నుంచి బయటకు వచ్చాకనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం మోడీపై దత్తాత్రేయ ఒత్తిడి తెస్తే హర్షించేవాళ్ళమని కర్నే పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల వైపు నిలబడాల్సిన దత్తాత్రేయ, కేంద్రం అంతా చేసిందని మాట్లాడడం హాస్యాస్పదమని హితవు పలికారు.తెలంగాణకు 2లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని అమిత్ షా చెప్పినపుడు సీఎం కేసీఆర్ ఆధారాలతో సహా ఖండించారని ఆయన తెలిపారు. దత్తాత్రేయ పాడిందే పాడరా అన్నట్టుగా అమిత్ షా పాటనే మళ్లీ పాడారంటూ విమర్శించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడిన దానిపై సరైన వివరణ ఇవ్వకుండా దత్తాత్రేయ కూడా గాలి మాటలతో విమర్శలకు దిగడాన్ని ఖండిస్తున్నామని ఎమ్మెల్సీకర్నే కౌంటర్‌ఎటాక్ చేశారు. బీజేపీ అంటే భారతీయ జూటా పార్టీ అని దత్తాత్రేయవ్యాఖ్యలు మరోమారునిరూపిం చాయన్నారు. ఇకనుంచి బీజేపీ కార్యాలయంపై ఉన్నపేరును తొలగించికొత్త బోర్డును తగిలించుకోవాలంటు చురకలంటించారు. నీతి ఆయోగ్ మిషన్ కాకతీయ,మిషన్ భగీరథలకు 24వేలకోట్ల రూపాయలుసాయం చేయాలనిప్రతిపాదించినా కేంద్రం ఎందుకుతిరస్కరించిందోచెప్పాలనికేటీఆర్ సూటి గాప్రశ్నించిన విషయాన్ని మరచిపోవద్దన్నారు.

గర్భిణిపై దాడి..

- కడుపులో నుంచి బయటపడ్డ పిండం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మం డలం మద్దిరాల తండాలో ఆరు నెలల గర్భిణి పై అంగన్ వాడీ ఆయా దాడి చేయగా కడుపులోని పిండం బయట పడింది మద్దిరాల తండాకు చెందిన బాదావత్ పద్మ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళింది.గుడ్డు విషయంలో ఆయాకు, గర్భిణి కి గొడవ జరిగింది. గర్భిణిపై ఆయా దాడి చేయ డంతో కడుపులో పిండం బయట పడింది. వెంటనే కొత్తగూడెం ఏరియా ఆసుపత్రి కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.



100 శాతం పూర్తి చేయాలె

- కృష్ణా, గోదావరిల్లో మన వాటా నీటిని పూర్తిగా సద్వినియోగం కావాలె
- ప్రణాళికలు, విధివిధానాలు రూపొందించండి
- రిటైర్డ్ ఇంజనీర్ల బృందం రిపోర్టుపై చర్చలు
- ప్రాజెక్టులపై ఇంజనీర్లు, అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, జనవరి 7, (మనం న్యూస్) : సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం,నిర్వహణ కోసం విధివిధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రానికున్న నీటి వాటాను వినియోగించుకునే వ్యూహం అమలు చేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, సాగునీళ్లు అందిస్తారనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశం ఇచ్చారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ఈ టర్మ్‌లో అన్ని ప్రాజెక్టులు నూటికి నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. దీనికి అధికారులు, వర్క్ ఏజన్సీలు సహకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత కూడా వాటి నిర్వహణ కోసం అవసరమైన నిధులను బడ్జెట్లో కేటాయిస్తామని వెల్లడించారు. రైతులకు సాగునీరు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు, మంచినీటికి కూడా ఎంతనీరు అవసరమవుతుందో లెక్కకట్టి, ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీరు వాడాలో నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం ఆదేశించారు. దీనికోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలో అయినా ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఆలస్యమైనా సరే, చెరువులు నింపడానికి కావాల్సిన ఏర్పాట్లు మాత్రం యుద్ధ ప్రాతిపదికన జరగాలని చెప్పారు.

ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన రిటైర్డు ఇంజనీర్లు, వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రభుత్వ ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతీ ప్రాజెక్టు పురోగతిపై రిటైర్డు ఇంజనీర్ల బృందం ముఖ్యమంత్రికి వివరించింది. ఈ సందర్భంగా ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించి, అక్కడికక్కడే లోపాన్ని సవరించడానికి అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం జరుగుతున్న చోట, జాప్యానికి కారణాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే వర్క్ ఏజన్సీలను మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

''తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు దశాబ్దాల తరబడి పోరాడారు. ప్రాణాలు కూడా అర్పించారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే సాగునీరు వస్తుందని ఆశ పడ్డారు. మొదటి టర్మ్‌లో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరించే పనులు చేపట్టాం. అన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో టిఆర్ఎస్ ప్రభుత్వానికున్న విశ్వసనీయతను ప్రజలు గుర్తించారు. ప్రాజెక్టులు పూర్తి చేయడం ఈ ప్రభుత్వం వల్లనే అవుతుందని నమ్మారు. 75 శాతం ఇదే కారణంతో టిఆర్ఎస్ కు మళ్లీ ఓటు వేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగునీరు అందించాం. వలసలు పోయిన వారు వాపస్ వచ్చారు. ఈ పరిస్థితి చూసే అక్కడి ప్రజలు 13 సీట్లలో టిఆర్ఎస్ ను గెలిపించారు. ఈ టర్మ్ లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేళ్ల పూర్తి సమయం మనకుంది. రాజకీయ సుస్థిరత ఉంది. నిధులకు కొరతలేదు. రైతులకు సాగునీరు అందివ్వడమే ధ్యేయంగా పనిచేయడానికిపునరంకితమవుదాం''అనిముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

''తెలంగాణ రాష్ట్రం వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అని ప్రధాని మోడీకి అనేక సార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 20-30 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా సరే నరేంద్రమోడి డబ్బులు ఇవ్వలేదు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరిస్తున్న తీరును చూసి దేశమంతా మెచ్చుకున్నది. వాటర్ మాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువులో పుట్టిన రోజు చేసుకుని మిషన్ కాకతీయ పనులను మెచ్చుకున్నారు. దేశమంతా ప్రశంసించారు. నీతి ఆయోగ్ కూడా మిషన్ కాకతీయ గొప్ప పథకమని చెప్పింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రూ.24వేల కోట్లివ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అయినా సరే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈ సారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మన రాష్ట్ర ఆదాయాభివ ద్ధి రేటు కూడా బాగుంది. మొదటి నాలుగు సంవత్సరాలలో 17.17 శాతం వ ద్ధిరేటుంటే, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 29.17 శాతం వ ద్ధి రేటు నమోదైంది. నిధులకు కొరతలేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం'' అని చెప్పారు.

'' గోదావరి నదిలో తెలంగాణకు 950 టిఎంసిల నీటి వాటా ఉంది. సమైక్య రాష్ట్రంలోనే ఇది ఖరారైంది. దీని ప్రకారమే మనం గోదావరిపై కాళేశ్వరం, తుపాకుల గూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించాలి. హైదరాబాద్ కు తాగునీరు అందించాలి. ఇదే లక్ష్యంతో ఆ ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. ఈ ఏడాది ఎండాకాలంలోనే పనులన్నీ పూర్తి చేసి, వర్షాకాలంలోఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు చెరువుల ద్వారా పొలాలకు చేరాలి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపు హౌజుల నిర్మాణం పూర్తి కావాలి. ఎల్లంపల్లి, మిడ్ మానేరు దాకా నీళ్లు రావాలి. మేడిగడ్డ నుంచి ప్రతీ రోజు రెండు టిఎంసిల చొప్పున నీరు తీసుకోవాలి. మూడు బ్యారేజిల ద్వారా 36 టిఎంసిల నీళ్లు, ఎల్లంపల్లిలో 20 టిఎంసిల నీళ్లు నదిలోనే అందుబాటులో ఉంటాయి. వచ్చిన నీటిని వచ్చినట్లు పంపు చేసి చెరువులకు మళ్లించాలి. ఎల్లంపల్లి దాకా వచ్చిన నీటిలో ఒక టిఎంసిని మిడ్ మానేరు ద్వారా శ్రీరాం సాగర్ కాల్వలకు మళ్లించాలి. మరో టిఎంసి నీళ్లను మల్లన్న సాగర్ వైపు మళ్లించాలి. మల్లన్న సాగర్ ద్వారా ఆలేరు, భువనగిరినియోజకవర్గాల్లో నిర్మించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్‌కు తరలించాలి. మల్లన్న సాగర్ ద్వారానే హైదరాబాద్ మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న 10 టిఎంసిల రిజర్వాయర్ కు నీళ్లు పంపాలి. హల్ది వాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీరు అందిం చాలి. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులు నింపాలి. వాటి ద్వారా క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ మూసీ నది మురికిని వదిలించాలి. మూసీ రివర్ ఫ్రంట్ ను అహ్మదాబాద్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ లాగా అభివ ద్ధి చేస్తాం. దానికి కూడా గోదావరి నీళ్లు అందాలి. చివరికి మూసీ నది నీళ్ల ద్వారా పాత నల్గొండ జిల్లా పొలాలకు నీరు చేరాలి'' అని ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని సీఎం వివరించారు.

''గోదావరి నదిపైనే నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బ్యారేజి కడుతున్నాం. ఏడాదికి 75 టిఎంసిలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా నీరు అందించాలి. పాఖాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరవులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలి. దీనికోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలి'' అని ఆదేశించారు.

''దుమ్ముగూడెంవద్ద నిర్మిస్తున్నసీతారామప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలి. మే నెలలో కూడా దుమ్ముగూడెం వద్ద ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరివ్వాలి. బయ్యారం వరకు నీటిని తీసుకురావాలి. ఎస్ఆర్ ఎస్పి ఆయకట్టుకూ నీరు అందాలి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన నిర్మాణాలుచేపట్టాలి''అని సీఎం చెప్పారు.

''ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడి (ప్రస్తుత వికారాబాద్) జిల్లాలకు సాగునీరు అందివ్వడానికి ఉద్దేశించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వేగం పెరగాలి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చింది. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి, మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలి. శ్రీశైలం సోర్సు నుంచి 70 టిఎంసిల వరకు తీసుకునే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ ప్రాజెక్టును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి, అడ్డుకున్నారు. దానివల్లే కొంత జాప్యం జరిగింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నంత వేగంగా ఇక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం సాగాలి. అవసరమైన నిధులను ఈ బడ్జెట్లోనే కేటాయిస్తాం'' అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటితో ముందుగా చెరువులు నింపాలని సిఎం ఆదేశించారు. గొలుసుకట్టు చెరువుల వ్యవ స్థను ఉపయోగించుకుని చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సాగునీటితో పాటు, తాగునీటికి ఎంత నీరు అవసరమవుతుందో, భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారు చేసి, నీటి కేటాయింపు జరపాలని సీఎం కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణరావు, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇఎన్సిలు మురళీధర్‌రావు, అనిల్ కుమార్, హరిరామ్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, సలహాదారు పెంటారెడ్డి, సిఇలు వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస రెడ్డి, బి.శంకర్, కె.బంగారయ్య, వి.సుధాకర్, వి.నర్సింహ,ఆర్.మధుసూదన్‌రావు, వి.రమేశ్, టి.ఖగేందర్, రిటైర్డు ఇంజనీర్లుశ్యాంప్రసాద్‌రెడ్డి,చంద్రమౌళి, వెంకటరామారావు, వేణుగోపాలరావు,రాంరెడ్డి,దామోదర్‌రెడ్డి, వెంకటేశం, సత్తిరెడ్డి, రమణానాయక్,ఎస్.ముత్యంరెడ్డి,జగదీశ్వర్, జియావుద్దీన్,ఇంద్రసేనారెడ్డి,కెప్టెన్‌జనార్ధన్‌తదితరులు పాల్గొన్నారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

మంగళవారం, జనవరి 8

ఎన్నికల అస్త్రం?

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రం వ్యూహాత్మకంగా సరికొత్త కసరత్తులు ప్రారంభిస్తోంది. ఎప్పటి నుంచో రిజర్వేషన్ల కోసం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈబీసీ) డిమాండ్ చేస్తున్నాయి. ఆ డిమాండ్ల మేరకు గతంలో మొరార్జీ దేశాయి నాయకత్వంలోని జనతా పార్టీ ప్రభుత్వం ఆలోచన చేసింది. కానీ కార్యరూపంలోకి తేవడానికి సాహసించలేకపోయింది. ఇప్పుడదే డిమాండ్‌ను నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం తలకెత్తుకుంది. ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం సోమవారం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఉద్యోగాల్లోను, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తారు. దీనికోసం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలంటే రాజ్యాంగం లోని 15, 16 అధికరణలను సవరించాల్సి ఉంది.

ఏడాది ఆదాయం 8 లక్షల రూపాయలు మించని, ఐదు హెక్టార్ల వ్యవసాయ భూమి ఉన్నవారు ఈ రిజర్వేషన్లకు అర్హులుగా కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. నివాసిత ప్రదేశం వెయ్యి చదరపు అడుగులకు మించి ఉండకూడదు. ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఈ బిల్లును కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్ చాంద్ గెహ్లాట్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించగా, అదో చిక్కు కాబోదని కేంద్ర మంత్రి చెప్పడం గమనార్హం.

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దూరమైన వర్గాలను దగ్గరకు తీసుకునేందుకు వ్యూహాత్మకంగా ప్రధాని నరేంద్ర మోదీ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ముస్లిం మహిళలను ఆకట్టుకునేందుకు త్రిపుల్ తలాఖ్ బిల్లు తీసుకొచ్చారు. బిల్లుల ఆమోదంలో కూడా వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారని త్రిపుల్ తలాఖ్, ప్రస్తుత ఈబీసీ రిజర్వేషన్ల అంశం చెప్పకనే చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాపువర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ ఆ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించి ఏళ్లు గడుస్తున్నా కేంద్రం పట్టించుకోలేదు. అలాగే మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అంశంలో ఎప్పటి నుంచో తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. అంతేగాక, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును కేంద్రం పట్టించుకోవడం లేదు. మహారాష్ట్రలో మరాఠాలు, రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పాటీదార్లు రిజర్వేషన్ల కోసం పెద్దయెత్తున ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ఆయా రాష్ట్రాల డిమాండ్లను పట్టించుకోకుండా ఉండడం కూడా వ్యూహంలో భాగంగానే కనిపిస్తోంది. ఆయా రాష్ట్రాల డిమాండ్లను ఆమోదిస్తే ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వ్యక్తమవుతున్న బీజేపీ వ్యతిరేక పవనాలకు మరింత ఊపిరి పోసినట్లే కాగలదు. ఆ డిమాండ్లను ఆమోదిస్తే అవి ఆయా రాష్ట్ర పాలక పార్టీలకే ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంటుంది కానీ, బీజేపీకి ఎలాంటి ప్రయోజనం ఉండదనేది నిర్వివివాదాంశం.


ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల తేనెతుట్టెను వెనక కేంద్రం కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించే కదిలించిందని భావించవచ్చు. ఈ రిజర్వేషన్లను వామ పక్షాలు సమర్థిస్తాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. అయితే, ఈబీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశాలున్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకు పార్లమెంట్‌కు ప్రస్తుతం ఉన్న సమయం చాలదని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. అన్నీ తెలిసే ఎంతో వ్యూహాత్మకంగా తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతోందని అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రకటనతో కేంద్రం ఎన్నికల నగారా మోగించినట్టేనని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. రాజకీయంగా మహిళా రిజర్వేషన్ బిల్లు వల్ల ప్రయోజనం చేకూరదనే కేంద్రం ఆ బిల్లుపై మౌనం పాటిస్తోంది.

ప్రజాసమస్యల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ప్రణాళికలో చేసిన అనేక అంశాలను పట్టించుకోకుండా హఠాత్తుగా ఈబీసీ రిజర్వేషన్ల బిల్లును తెరపైకి తేవడంలో రాజకీయ ప్రయోజనాలు మినహా మరొకటి కాదు. ప్రస్తుతం ప్రభుత్వ వైఖరిని పరిశీలిస్తే రాజకీయంగా ప్రయోజనం కలిగించే అంశాలపై ఇక చకచకా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై కూడా త్వరలోనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని, ఆలయ నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరని బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు ఘంటాపథంగా ప్రకటిస్తుండడం గమనార్హం. ఈబీసీ రిజర్వేషన్లతో బీసీ, దళిత పార్టీలను ఆత్మరక్షణలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పుకారణంగా ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం అమలులో అనేక సమస్యలకు కారణం కాగలదు. ఏదేమైనా ఈ నిర్ణయం దళిత, బీసీ పార్టీలను ఆయోమయంలో పడేస్తుండగా, బీజేపీకి మాత్రం ఎన్నికల అస్త్రంగా ఎంతో ఉపయోగపడుతుందనడంలో సందేహం అక్కరలేదు. ●

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో హామీపత్రాన్ని జతచేస్తూ పంపవలసిందిగా సూచన.

e-mail: manamlekhalu@gmail.com

చిరునామా : Manam Telugu Daily, D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor, Green lands, opp. Green park Hotel, Hyderabad, 500016



ఒక్కటవుతున్న ఎస్పీ, బీఎస్పీ పార్టీలు (మాయా-అఖిలేష్)

మంచిమాట



హంతకుడిని అంతం చేసేందుకు మరొక హంతకుడు తయారవుతాడు.

- గౌతమ బుద్ధుడు

కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై
ఐక్య పోరాటం

మరోపక్క నూతన పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఫెడరేషన్లు దేశ వ్యాపితంగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అందుకే ప్రభుత్వం అనుసరించే ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అందరూ సంఘటితంగా బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్తంగా జరుగుతున్న 'సార్వత్రిక సమ్మె'కు సంపూర్ణంగా తెలంగాణ లోక్‌సత్తా కూడా మద్దతుగా పాల్గొంటుంది.

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు గడిచాయి. మోదీ అధికారంలోకి వచ్చీ రాగానే కార్మికులు, శ్రామికులపై కత్తికట్టారు. తనను అధికారంలోకి తేవడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తుల రుణం తీర్చుకునే పనిని ప్రారంభించారు. పెట్టుబడిదారులు, దోపిడీదారుల ప్రయోజనాలే లక్ష్యంగా కార్మిక సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను సూలంగా మార్చే పనిని చేపట్టారు. ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న కార్మిక చట్టాలు కాలం చెల్లినవని, మారిన దేశ పరిస్థితులకు అనుగుణంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సన్నాయి నొక్కులు నొక్కారు

గతంలో కాంగ్రెస్ పార్టీ పీవీ నర్సింహారావు మొదలుకొని మన్మోహన్‌సింగ్ నాయక్వంలోని (యుపిఎ 1, యుపిఎ 2) ప్రభుత్వాలు ప్రారంభించి, కొనసాగించిన నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానలే మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. వారు చేయలేనంత వేగంగా, తీవ్రంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. వీటి కొనసాగింపే మోదీ ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల సవరణలు ప్రధానంగా రైల్వే, రక్షణ, బీమా రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లను ఆహ్వానిస్తున్నది. బొగు, బ్యాంకింగ్, ఓడరేవులు, పోస్టల్ సేవారంగాలను కార్పొరేట్ కంపెనీల పరం చేసే పనిని వేగంగా అమలు చేస్తున్నది. 2014 ఎన్నికల్లో ప్రతి సంవత్సరం 3 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ ఊసే మరిచింది. నిత్యావసరాల వస్తువుల ధరలను తగ్గించి, అదుపులో ఉంచుతానని చెప్పి అధికారం పొందింది కానీ, ధరలు తగ్గించకపోగా ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యపరుస్తున్నది. నగదు బదిలీ పేరుతో సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తూ రద్దు చేసే పద్ధతిలో ఉంది. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం, తన మిత్రపక్షాల బలాన్ని కలుపుకుంటే లోక్‌సభలో తిరుగులేని ఆధిక్యాన్ని కలిగి వుంది. దీనితో తన నయా ఉదారవాద విధానాల అమలుకు బీజేపీ ప్రభుత్వానికి మంచి అవకాశం లభించింది. అదే అదనుగా కార్పొరేటు శక్తులు ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూటీఓలు కూడా మోదీ ప్రభుత్వం ముందు తమ ఎజెండాలను పెడుతూ పోతున్నాయి. దేశంలోని వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రముఖ సమాఖ్యలైన ఫిక్కీ, అసోచామ్‌లు కూడా కార్మిక చట్టాల సవరణ ప్రక్రియలో తమ పని తాము చేస్తూనే ఉన్నాయి. మోదీ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండి దేశదేశాల గడపలు తడుతున్నారు. తన విదేశీ పర్యటనలలో 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో రెండు చేతులు బార్లా చాచి విదేశీ కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానిస్తున్నారు. కార్మికుల, శ్రామికుల నుంచి ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా చేస్తానని గట్టిగా హామీలు ఇచ్చి వస్తున్నాడు. ఇందుకు అవసరమైన కార్యాచరణ కొనసాగిస్తున్నారు. దీనికి అనువైన వాతావరణాన్ని సృష్టించుకోవడానికి ప్రచారాన్ని సైతం సాగిస్తున్నాడు.

ప్రస్తుతం ఉన్నవి ఎప్పటివో కాలం చెల్లని చట్టాలని మారిన పరిస్థితులకు అనుగుణంగా, ఈ చట్టాలను సైతం మార్చవల్సిన అవసరం ఉందని ప్రచారం చేస్తున్నారు. కార్మిక చట్టాలను సవరించడం వల్ల దేశ కార్మికులకు తీరని అన్యాయం జరుగనున్నది. దాదాపు 9 దశాబ్దల కింద తెల్లదొరల కాలం నాడే దేశ కార్మికులు పోరాడి సాధించిన కార్మిక చట్టాలపై వేటు పడనుంది. పనిగంటలు, కనీస వేతనాలు, నష్ట పరిహారాలు సెలవులు, బోనస్, ఇఎస్ఐ, పిఎఫ్, గ్యాట్యుటీ, పెన్షన్, తదితర రిటైర్మెంట్ ప్రయోజనాలతో పాటుగా ఉద్యోగ భద్రతను దేశ కార్మికులు కోల్పోనున్నారు. ఈ దాడిని ప్రారంభించే ముందుగా తమ బీజేపీ అధికారంలో గల రాజస్థాన్ ప్రభుత్వాన్ని రోల్‌మోడల్‌గా ముందుకు తెచ్చారు. 2014 ఆగస్టులోనే మొదటగా రాజస్థాన్ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణలను ప్రారంభించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టడమే కాకుండా దేశంలోని 29 రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేస్తున్నది. అనేక విషయాలలో మోదీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రభుత్వం అడుగులకు మడుగులు ఒత్తేదిశగా పయనిస్తున్నాయి.

మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత నాలుగున్నరేండ్లుగా ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను దూకుడుగా కొనసాగిస్తున్నది. ఒకపక్కన రైతుల, కార్మికుల, వ్యవసాయ కూలీల సామాజిక తరగతుల బతుతులను దిగజార్చుతున్నది. బీజేపీ విధనాల వల్ల సంపన్నుల ఆస్తులు అనేక రెట్లు పెరిగాయి. 73% సంపద ఒక శాతంగా ఉన్న ధనవంతుల వద్ద కేంద్రీకృతమైపోయింది. అందువల్లనే దేశంలో నిరుద్యోగం, కనీస వేతనాలు, గిట్టుబాటు ధరలు, దారిద్ర్యం, వలసలు తదితర సమస్యలు పరిష్కారం కావటం లేదు. కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిత్యావసర ధరలు పెరిగిపోయాయి. కార్మికుల జీవన ప్రయాణాలు దిగజారుతున్నాయి. రైతాంగానికి గిట్టుబాటు ధర ప్రభుత్వం రుణవసతి, నాణ్యమైన ఎరువులు, విత్త నాలు సమగ్రంగా సరఫరా చేయక పోవడంతో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. వ్యవసాయ కూలీల పరిస్థితి మరీ ఘోరం. బీజేపీ ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ తుంగలో తొక్కింది. ఒకపక్క పెట్టుబడిదారులకు అనుకూలంగా సరళీకరణ, సంస్కరణలను అమలు చేస్తున్నది. మరోవైపు సంక్షోభం, మాంద్యంలో చిక్కుకొని ఉన్న చిన్న పారిశ్రామిక వ్యవసాయ రంగాలు పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ లాంటి చర్యలతో మరింత తీవ్రంగా దెబ్బతిన్నాయి. పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. దేశంలో కోట్లాది మందికి ప్రాణాధారమైన ప్రజా పంపిణీ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నీరుకారుస్తున్నది. పని లేని రోజుల్లో పేదలకు ఉపాధి కల్పించాల్సిన ఉపాధి హామీ పథకానికి నిధుల కోత, వ్యవసాయ కూలీలకు శాపంగా మారింది. కనీస వేతనం 1957 ఇండియన్ లేబర్ కాంగ్రెస్ (ఐఎల్‌సి) 15వ తీర్మాణం 1992 సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం నేటి మార్కెట్ ప్రకారం నెలకు సుమారు రూ. 26,000/లు ఇవ్వాలి. ఐనప్పటికీ 7వ పే కమిషన్ ప్రకారం నిర్ణయించిన రూ. 18000/లను కనీస వేతనంగా అమలు జరపమని దేశంలోని జాతీయ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా కోరుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మరోపక్క నూతన




పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఫెడరేషన్లు దేశ వ్యాపితంగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అందుకే ప్రభుత్వం అనుసరించే ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అందరూ సంఘటితంగా బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో జనవరి 8, 9 తేదీల్లో దేశ వ్యాప్తంగా జరుగుతున్న 'సార్వత్రిక సమ్మె'కు సంపూర్ణంగా తెలంగాణ లోక్‌సత్తా కూడా మద్దతుగా పాల్గొంటుంది.

◆ మన్నారం నాగరాజు
9550844433

(నేడు, రేపు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె)

చావే శరణ్యం



వానదేవర కన్నుదెరిచె...
మా పేద బ్రతుకుల్లో
వెలుగులొచ్చే...
అవధులు లేని
ఆనంద పరవళ్ళలో...
ఆసామి కాడ
అప్పుచేస్తి....
షావుకారి కాడ
విత్తులు తెస్తి...
నేలతల్లిలో నాట్లు వేస్తి...
పుడమితల్లిలో
పైరు జేస్తి...
పంట పరవళ్లు దొక్కే...
అవధులులేని
ఆనంద పరవళ్ళలో...
పుడమితల్లి కాపు చేతికిచ్చే ...
సందకాడ గజరాజులు
తినిపోయె...
చేతికొచ్చిన పంట
చేజారిపోయె...
నోటికూడు తన్నుకుపోయె...
రేయి పగలు కష్టం నేలపోయె...
అప్పిచ్చిన ఆసామి
ఉన్నగూడు తీసుకుపోయె...
కాలేకడుపు మాడేమంటల
జ్వాలలో
నా తనువు కాలిపోయె...

-సివేగారి చిన్నికృష్ణ
6300318230

పసిమొగ్గలను మింగేస్తున్న కాలుష్యం

బాలల బంగరు భవితను సుందరంగా నిర్మించడంలో కీలకపాత్ర ప్రకృతిది. దాని పరిరక్షణను ప్రభుత్వాలు విస్మరించడం వల్ల ఆ బాలగోపాలం ఇక్కట్ల పాలవుతూనే ఉంది. అ మూల్యమైన పర్యావరణ రంగంలో అతి ప్రమాదకర మార్పులా.. అంటూ ఐక్యరాజ్య సమితి గతంలోనే ప్రశ్నించింది. అందరికీ జలమే ఆధారం. అది కలుషితమైన కారణంగా మనదేశంలోని ఐదేళ్ళ లోపు చిన్నారుల్లో ఏటా దాదాపు 17లక్షల మంది శాశ్వతంగా కన్నుమూస్తున్నారు. అపరిశుభ్ర పరిసరాలు, కలుషిత జలాలనే తాగక తప్పని పరిస్థితుల్లో వ్యాధుల బారిన పడి ఏటా వేల సంఖ్యలో పిల్లలు విగత జీవులవుతున్నారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చట్టాలు లేకపోలేదు. 1974లో ఒకసారి, అనంతరం మూడేళ్ళకు మరోసారి దేశంలో ఆ చట్టాలు తెచ్చారు. అమలు తీరు సరేసరి. నానారకాల మురికి పదార్థాలూ నీళ్ళలో కలుస్తున్నాయి. ద్రవ, ఘన, వాయు వ్యర్థాలెన్నో నీటిలోకే చేరుతున్నాయి. ఇది పిల్లల పాలిట ప్రాణాంతకమవుతోంది. నానారకాల కాలుష్యాలతో ప్రాణాలు కోల్పోతున్న వారెందరో! వారిలో 92 శాతం పేద లేదా తక్కువస్థాయి ఆదాయాలు గలవారున్నారు. ఆ మృతుల్లో అనేకమంది బాలలేనని ఓ అంతర్జాతీయ వైద్య పత్రిక తాజా అధ్యయనం నిర్ధారించింది. వాయు కాలుష్యం వల్ల మన దేశంలో ఉత్తరాది ప్రాంతాల్లో అయిదేళ్ళ లోపు పసివాళ్ళు ఏటా 6 లక్షల మంది మృత్యువు పాలవుతున్నారు. వివిధ దేశాల్లో 30కోట్ల బాలబాలికలు విషపూరిత వాయువుల వల్ల పలు రుగ్మతలకు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. దూళితో నిండిన రోడ్లు, వాటిపై ధూమకాలుష్యం తెచ్చే చేటు అంతా ఇంతా కాదు. పరుగులు తీసే పొగల బండ్లు పిల్లల గుండెల్ని అదరగొడుతున్నాయి. పరిశ్ర మల నుండి వెలువడే పొగ వాయువులు, కర్మాగారాలు విడుదల చేసే రసాయన తదితర వ్యర్థ పదార్థాలు లక్షలాది పిల్లల జీవితాలకు ఎడాపెడా తూట్లు పొడుస్తున్నాయి. వారి మెదడు, ఊపిరితిత్తులపై అవి పెను ప్రభావం చూపుతున్నాయి. బాలల వ్యాధి నిరోధక వ్యవస్థను అత్యంత దారుణంగా దెబ్బ తీస్తున్నాయి. అనేక దేశాల్లో ఏటా 34 లక్షల పసికందులు నెలలు నిండకుండానే పుడుతున్నారంటే, వాయుకాలుష్య తీవ్రతే మూలకారణం. కాలుష్య రక్కసికి లెక్కలేనన్ని రూపాలు. అది గాలితో పాటు భూమిని, జలాల్ని విషమయం చేస్తుంటే, పసిప్రాణాలు నిలిచేదెలా? పర్యావరణ పరిరక్షణను లక్షించి మనదేశంలో చట్టం రూపొంది 33ఏళ్ళు గడిచాయి. వివిధ పారిశ్రామిక కాలుష్య నియంత్రణ చట్టాలు ఒకటీ రెండూ కాదు, మూడు దశాబ్దాలుగా ఉన్నాయి. వాటి అమలు అప్పటి నుంచీ అంతంత మాత్రమే! అలా అని పర్యావరణాన్ని రక్షించడం ప్రభుత్వశాఖలకో, స్వచ్ఛంద సంస్థలకో పరిమితం కాదు. అది సమాజంలో ఉండబడే ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యంగా భావించాలి. కాలుష్యరహిత వాతావరణంలో జీవించడం మానవహక్కుల్లో అంతర్భాగం అని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.ఆ తీర్పు బాలల హక్కులకూ వర్తిస్తుంది. వారు కాలుష్యాల బారిన పడకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ పంజాబ్, హర్యానా, రాజస్థాన్ ప్రభుత్వాలని నిలదీసింది.'స్వచ్ఛమైన గాలి, నీరు కల్పించకపోవడం అంటే జీవించే హక్కును కాలరాయడమే అవుతుందనీ పేర్కొంది. శబ్ద కాలుష్యం కలిగించే అనుభవాలు ఎంత భయానకమో చెప్పనలవి కాదు. వాటివల్ల బాలబాలికలకు నరకయాతనే! ఒక్క వినికిడి శక్తినే కాదు.. మెదడు, రక్తప్రసరణ, జీర్ణశక్తి, జీవక్రియలన్నింటిపైనా ధ్వని కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇన్ని రకాల కాలుష్యాల కోరల్లో చిక్కిన బాలల్ని కాపాడే ఛత్రాలు రెండు. స్వచ్ఛత కోసం పరితపించే ప్రభుత్వాల నిబద్ధత ఒకటి. దానికి కుడిఎడమల దన్నుగా నిలిచే పౌరసమాజ బాధ్యతాయుత వైఖరి మరొకటి.ఈ రెండింటి కలయికతోనే కాలుష్యాన్ని నియంత్రించడం సాధ్యపడుతుంది.

◆ శ్రీనివాస్ చిరిపోతుల
96034 71199

సహకారం శ్రేయస్కరం

సమాజంలోని అత్యంత గౌరవప్రదమైన వృత్తుల్లో ఔషధ వ్యాపారం కూడా ఒకటి. మానవ ఉనికి ప్రారంభం నుండే ఆయా కాలాలకు తగినట్లు ఏదో ఒక మేర ఔషధ వినియోగం కూడా ఉండేది. పాత రోజుల్లో వంట దినుసులే ఔషధాలుగా పని చేసేవి. కాలక్రమంలో అనేక పరిణామాలు సంభవించాయి. ఆకులు అలములతో ప్రారంభమైన ఔషధ వినియోగం అనేక ప్రక్రియలు, అనేక మార్పులు చెందుతూ యూనానీ, ఆయుర్వేదం, అల్లోపతి, హోమియోపతి లాంటి అనేక పేర్లతో, అనేక రూపాల్లో విస్తరణ చెందింది. ప్రారంభంలో ఔష ధాల విక్రయం జరిగేది కాదు. ఎవరికైనా ఏదైనా అనారోగ్యం సంభవిస్తే తెలిసిన వారు తెలిసిన వైద్యం చేసేవారు. చిన్నచిన్న చిట్కాలతోనే రోగాలు నయమైపోయేవి. కేవలం మానవతా దృక్పథంతో, పుణ్యఫలాపేక్షతో మాత్రమే సాటివారికి సహాయం చేసేవారు. రానురానూ ఔషధ అవసరాలు పెరిగిన క్రమంలో కేవలం ఖర్చులకు సరిపోయే విధంగా నామ మాత్రపు వెల మాత్రమే తీసుకోవడం ప్రా రంభమైంది. ఔషధ విక్రయ ప్రక్రియ ప్రారంభైన తొలినాళ్ళలో కేవలం సేవాభావమే తప్ప ఏ విధ మైన లాభాపేక్ష లేకుండా ఔషధ విక్రయాలు జరి గేవి. తరువాతి క్రమంలో అనారోగ్యాలతో పాటు, ఔషధాల వినియోగం కూడా పెరగడంతో వ్యవస్థీకృతమైన వ్యాపారానికి అంకురార్పణ జరిగింది. అందులో భాగంగా హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. హోల్‌సేల్ దుకాణాల నుండి రిటైలర్లు తమకు కావలసిన మందులు తెచ్చుకునేవారు. పదులు ఇరవైలు కాదు, వందల కిలోమీటర్లు ప్రయాణించి ఔషధాలను రోగులకు అందుబాటులోకి తెచ్చేవారు. ఆ క్రమంలో నాటి కెమిస్టులు అనుభవించిన కష్టాలు, బాధలు వర్ణనాతీతం. రవాణా సౌకర్యాలు నామమాత్రంగానైనా లేని ఆకాలంలో వందా రెండొందల కిలోమీటర్ల వరకు బొగ్గు లారీలపై, పడవలపై ప్రయాణించి, ఒక్కొక్క రోజు ఎక్కడో ఒకచోట నిద్ర కూడా చేసి మరునాడు ఇళ్ళకు చేరిన సందర్భాలు కోకొల్లలు. కొంతమంది కెమిస్టులు సైకిల్ క్యారేజీలకు మెడికల్ బాక్సులు కట్టుకొని ప్రయాణం చేసిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం సేవాభావంతో సేవలందించిన చరిత్ర గ్రామీణ కెమిస్టులది. అనునిత్యం వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలందించేవారు.



కాని ఈనాడు అనేక సౌకర్యాలు, సౌలభ్యాలు సమకూరాయి. రవాణ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో కెమిస్టులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ కెమిస్టులు సంతోషించారు. అదే సమయంలో వ్యాపారపరమైన సవాళ్ళు కూడా ప్రారంభమయ్యాయి. వ్యాపారపరమైన పోటీ పెరిగింది. కొన్ని కార్పోరేట్ సంస్థలూ రంగ ప్రవేశం చేశాయి. మారుతున్న కాలానికనుగుణంగా తమను తాము ఆధునీకరించుకుంటూ కెమిస్టులు ఆయా సంస్థలకు సాదరంగా స్వాగతం పలికారు. ఆరోగ్యకరమైన వ్యాపార పోటీని మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. కార్పొరేట్ షాపులతో మమేకమై వాటినీ తమలో కలుపు కున్నారు. స్నేహహస్తం అందించి అడుగులో అడుగేసి ముందుకు నడిచారు. సంఘపరంగా తాము చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో వారిని సముచిత రీతిలో భాగస్వాముల్ని చేశారు. తమలో ఒకరిగా కలుపుకున్నారు. అయినప్పటికినీ, వ్యాపారపరంగా తమను దెబ్బతీయాలన్న ధోరణి కార్పొరేట్ సంస్థల్లో కనబడుతోందని సంప్రదాయ కెమిస్టులు ఆవేదన చెందుతున్నారు. డిస్కౌంట్ల రూపంలో వినియోగదారులను ఆకర్షించడాన్ని వారు దీనికి ఉదాహరణగా చూపెడుతున్నారు. సేవ విషయంలోను, నాణ్యత విషయంలోను పోటీ పడాలన్నది వారి వాదన. అంతేకానీ, తాయిలాల రూపంలో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేయడం వల్ల వినియోగదారుల్లో అనవసరమైన అనుమానాలు, అపోహలు తలెత్తే ప్రమాదం ఉందని, వ్యాపారపరంగా, వ్యక్తిగతంగా, సామాజికంగా తమపై నిరాదారమైన చెడు అభిప్రాయం కలిగే అవకాశం ఉందంటున్నారు. మరోరకంగా ఈ విధమైన తాయిలాలు ప్రకటించి వినియోగదారుల్ని ఆకర్షించడం వారిని కూడా అవమానించడమే అవుతుంది. కాబట్టి, ఇలా కాకుండా ఇరవైనాలుగు గంటలూ వినియోగదారులకు అందుబాటులో ఉండి, నాణ్యమైన ఔషధాలను అందిస్తూ, వారి విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నం చేయాలి. వ్యాపారాభివృద్ధి కోసం ఇతోధికంగా కష్టపడాలి. అంతేకాని మన వ్యాపారాలను పెంచుకోవడం కోసం ఇతరుల వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూడడం ఎంతమాత్రం సమంజసం కాదు.అది వ్యాపార సూత్రమూ కాదన్నది ఆయా రంగాల నిపుణుల మాట. ఎవరి వ్యాపారం వారు చేసుకుంటూ పరస్పర అవగాహన, పరస్పర సహకారంతో కలసిసాగితే ఉభయులకూ శ్రేయస్కరమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కనుక కార్పొరేట్ వ్యాపారులు సంప్రదాయ కెమిస్టుల మనోభావాలను, వారి ఆవేదనను, వారి ఇబ్బందులను మంచి మనసుతో అర్థం చేసుకొని పరస్పరం సహకరించుకుంటూ అవగాహనతో ముందుకు సాగడం అందరికీ మంచిది. తద్వారా ఉభయవర్గాలూ వ్యాపారాభివృద్ధితో పాటు, పరస్పర స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆనందంగా మనుగడ సాగించే అవకాశాలు మెరుగుపడతాయి. ఆయా సంస్థల బాధ్యులు, యాజమాన్యాలు ఈ దిశగా ఆలోచిస్తాయని, సకారాత్మకంగా స్పందిస్తాయనీ ఆశిద్దాం.

◆ యండి. ఉస్మాన్ ఖాన్
9912580645



అరెస్టంటే... జైలుకెళ్తారు జాగ్రత్త!

- **సెక్షన్ 66(ఎ) ఎప్పుడో రద్దయింది కదా**
- **అయినా ఆ సెక్షన్ కింద అరెస్టులా..?**
- **ఐటీ చట్టంపై సుప్రీంకోర్టు మండిపాటు**

న్యూఢిల్లీ, జనవరి 7: సైబర్ క్రైమ్, ఈ కామర్స్ చట్టంలో ఇప్పటికే రద్దయిన ఓ సెక్షన్ కింద ఇప్పటికీ అరెస్టులు జరుగుతుంటే ప్రభుత్వం ఎందుకు నివారించడం లేదని సుప్రీంకోర్టు మండిపడింది. అలా అరెస్టుకు ఆదేశాలిచ్చే ప్రభుత్వాధికారులను జైల్లో పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66 (ఎ)ను సుప్రీంకోర్టు 2015లో కొట్టేసింది. అది రాజ్యాంగవిరుద్ధమని తేల్చిచెప్పింది. అయినా, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ సంస్థకు చెందిన 22 మందిని అదే సెక్షన్ కింద ఇటీవల అరెస్టు చేసి విచారించారు. దీన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు చెప్పింది. సెక్షన్ 66(ఎ) కింద అసరెస్టుకు ఆదేశించిన అధికారులను జైలుకు పంపుతామని జస్టిస్ రోహిన్టన్ నారిమన్, జస్టిస్ వినీత్ శరణ్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. ఈ విషయమై సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. మీడియా నివేదికలు, జాతీయ నేర రికార్డుల బ్యూరో వెల్లడించే సమాచారం, ఆన్‌లైన్ డేటాబేస్‌లలో ఉన్న కేసుల ఆధారంగా తమ పరిశోధన సాగిందని పీయూసీఎల్ తెలిపింది. శ్రేయా సింఘాల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటికీ ఐటీ చట్టంలో మాత్రం సెక్షన్ 66(ఎ) అమలవుతూనే ఉందని పీయూసీఎల్ తన పిటిషన్‌లో పేర్కొంది. నాటి న్యాయవిద్యార్థిని అయిన శ్రేయా సింఘాల్.. ఈ సెక్షన్‌ను తొలిసారి సుప్రీంకోర్టులో సవాలుచేశారు. వాక్ స్వాతంత్ర్యం, ఇంటర్‌నెట్ స్వాతంత్ర్యాలను ఈ సెక్షన్ హరించేలా ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు, అసమ్మతి తెలిపేవారందరినీ దీనికింద లోపలకు తోసేస్తున్నారు. ఐటీ చట్టాన్ని 2000 సంవత్సరంలో రూపొందించినా, 2008లో ఒక సవరణ ద్వారా అందులో సెక్షన్ 66(ఎ)ను చేర్చారు. ప్రముఖ కార్టూనిస్టు అసీమ్ త్రివేదిని కూడా అవినీతిపై కార్టూన్ వేసినందుకు ఇదే సెక్షన్ కింద 2012లో అరెస్టుచేశారు.

అనిల్ అంబానీకి సుప్రీం నోటీసులు

- **బకాయిలు కట్టాలంటూ ఎరిక్సన్ పిటిషన్**

న్యూఢిల్లీ, జనవరి 7: రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) ఛైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. తమకు చెల్లించాల్సిన బకాయిలు ఇంకా చెల్లించకపోవడంతో పాటు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ అనిల్ ధీరూభాయ్ అంబానీ, ఇతరులపై ఎరిక్సన్ ఇండియా వేసిన పిటిషన్ ఆధారంగా ఈ నోటీసులిచ్చారు. జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం నాలుగు వారాల్లోగా అంబానీ, ఇతరులు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎరిక్సన్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తం రూ. 118 కోట్లుగా అంగీకరించాలని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి ఆర్‌కామ్ తరపున కోర్టును కోరారు. అయితే, ఎరిక్సన్ తరపు న్యాయవాది మాత్రం ఆ మొత్తాన్ని తిరస్కరించి, మొత్తం రూ. 550 కోట్లు డిపాజిట్ చేయాల్సిందేనని అన్నారు. దాంతో ధర్మాసనం ముందుగా ఆర్‌కామ్ సంస్థను రూ. 118 కోట్లకు డిమాండ్ డ్రాఫ్ట్ తీసి రిజిస్ట్రీకి సమర్పించాలని ఆదేశించింది.

మళ్లీ వచ్చేసింది

- **కొత్త సంవత్సరంలోనూ సోమవారం**
- **ఇన్‌స్టాలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ**
- **వేలాది లైకులు.. కామెంట్ల వెల్లువ**

న్యూఢిల్లీ, జనవరి 7: సోమవారం వచ్చిందంటే చాలు.. అందరికీ ఎక్కడలేని బద్ధకం వచ్చేస్తుంది. రెండు రోజుల విశ్రాంతి తర్వాత మళ్లీ పనిలోకి బయల్దేరాలంటే కళ్ల ముందు నరకం కనపడుతుంటుంది. అందుకే సోమవారం మీద ఎక్కడలేని జోకులు పేలుతుంటాయి. సెన్సాఫ్ హ్యూమర్‌కు పెట్టింది పేరైన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ కూడా సోమవారం బాధితురాలే. కొత్త సంవత్సరంలో కూడా అప్పుడే సోమవారం వచ్చేసిందంటూ 'ఫిర్ ఆగయా' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ చేశారు. ఆమె అలా పోస్ట్ చేశారో లేదో.. వెంటనే వేలాది కామెంట్లు, లైకులు వెల్లువెత్తాయి. ఆమె సెన్సాఫ్ హ్యూమర్ బాగుందని కొందరు, హేవ్ ఎ నైస్ డే అని మరికొందరు, మీ క్యాప్షన్లు చాలా బాగుంటాయని ఇంకొందరు కామెంట్లు చేశారు. గతంలో కూడా సోమవారం గురించి పలు జిఫ్‌లు, ఫొటోలు, కేప్షన్లు పెడుతూ నెటిజన్లను స్మృతి ఇరానీ సంతోషపెడుతూ ఉండేవారు.

ఇందిరపై గడ్కరీ ప్రశంసలు

- **కోటా లేకుండానే ఆమె రాణించారని వ్యాఖ్య**

నాగ్‌పూర్, జనవరి 7: మాజీ ప్రధాని ఇందిరా గాంధీపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసల జల్లు కురిపించారు. మహిళా రిజర్వేషన్ల హోదా పొందకుండానే ఆమె మగవారి మధ్య మేటి నేతగా ఎదిగారని కొనియాడారు. నాగపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మహిళల రిజర్వేషన్ అంశంపై మాట్లాడారు. మహిళా రిజర్వేషన్‌కు తాను వ్యతిరేకం కాదు అని, కానీ కుల, మతాల మీద ఆధారపడే రాజకీయాలను వ్యతిరేకిస్తానన్నారు. అనేక మంది మేటి మగ నేతల మధ్య ఇందిరా గాంధీ తన సత్తా చాటారు అని, అది కూడా ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం పొందకుండానే ఆమె పాలించారన్నారు. కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ లాంటి మేటి మహిళా నేతలు కూడా ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం పొందకుండానే రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. ఎవరైనా తమకు ఉన్న ప్రతిభ మేరకే రాణిస్తారని, కానీ భాష, కులం, మతం, ప్రాంతం లాంటి అంశాలమీద కాదు అని ఆయన అన్నారు.

బీజేపీకి ఏజీపీ గుడ్‌బై

- **ఎన్ఆర్‌సీపై విభేదాలు** • **మిత్రపక్షంగా కొనసాగం: అతుల్**

గువాహటి, జనవరి 7: బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. అసోంలో ఆ పార్టీ మిత్రపక్షం అసోం గణ పరిషత్ (ఏజీపీ) షాకిచ్చింది. జాతీయ పౌర గుర్తింపు (ఎన్ఆర్‌సీ) బిల్లుపై విభేదాల నేపథ్యంలో బీజేపీతో పొత్తును తెంచుకోవాలని నిర్ణయించింది. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అనంతరం ఏజీపీ అధ్యక్షుడు అతుల్ బోరా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ బిల్లుపై కేంద్రం వైఖరి తెలిసిన అనంతరం ఇంకా బీజేపీతో పొత్తు కొనసాగించాలనుకోవడం తమ మధ్య కుదిరిన 'అసోం ఒప్పందా'నికి అర్థం లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీపై జేపీసీ తన నివేదికను సమర్పించిన అనంతరం బీజేపీతో పొత్తును తెంచుకుంటున్నామని అతుల్ బోరా ప్రకటించడం గమనార్హం.

ఇదో పోల్ జిమ్మిక్

- **అగ్రవర్ణాలకు పేదలకు పది శాతం కోటాపై విపక్షాలు**
- **తక్షణమే సవరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి**
- **కేంద్ర కేబినెట్ నిర్ణయం తేనెతుట్టెను కదపడమే: కాంగ్రెస్**



న్యూఢిల్లీ, జనవరి 7: విద్య,ఉద్యోగాల్లో అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించాలని ఇవాళ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని క్యాబినెట్ కూడా ఆమోదించింది. అయితే ఆ నిర్ణయాన్ని ఓ పోల్ జిమ్మిక్‌గా కాంగ్రెస్ ఆరోపించింది. అభిషేక్ మను సింఘ్వీ దీనిపై ట్వీట్ చేశారు. కోటా 50 శాతం దాట వద్దు అని సుప్రీం తీర్పు ఉంది. మరి ఆ నేపథ్యంలో ప్రభుత్వం ఎలా కోటాను అధిగమిస్తుందని సింఘ్వీ ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఏర్పర్చిన నాలుగు ఏండ్ల 8 నెలల తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకుందని, అంటే ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ తెలిపారు.

10 శాతం కోటాకు అర్హతలివే..!

న్యూఢిల్లీ, జనవరి 7: అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకపడిన వారికి పది శాతం కోటా ఎవరికి అందుతుంది? అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వాళ్లు అంటే ఎవరు? ఎవరికి ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయి? అన్న సందేహం రావడం సహజం. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లకు కావాల్సిన అర్హతలు ఇలా ఉన్నాయి..

- ప్రధానంగా వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలన్నది మొదటి అర్హత.
- ఇక వ్యవసాయ భూమి 5 ఎకరాల లోపే ఉండాలి
- వెయ్యి చదరపు అడుగుల లోపు ఇల్లు మాత్రమే ఉండాలి
- నోటిఫైడ్ మునిసిపాలిటీలో 100 గజాలలోపు ఇంటి స్థలం
- నాన్ నోటిఫైడ్ మునిసిపాలిటీ ప్రాంతంలో 200 గజాల లోపు ఇంటి స్థలం

ఇప్పటివరకు జనరల్ కేటగిరీలో ఉండి ఆర్థికంగా వెనుకబడినా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండేవి కావు. ఇప్పుడు వాళ్లకు కూడా పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు నిబంధన నేపథ్యంలో ఇదెంత వరకు ఆచరణ సాధ్యమవుతుందో చూడాలి.

సవరణ బిల్లు తీసుకురావాలి: కేజ్రీవాల్



కేబినెట్ నిర్ణయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ చేశారు. పార్లమెంట్‌లో సవరణ బిల్లును తీసుకురావాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఆ బిల్లుకు తమ పార్టీ ఆమోదం తెలుపుతుందన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నికల దృష్టిలోనే ఈ నిర్ణయాన్ని తీసుకుందని, అదో రాజకీయ ఎత్తుగడగా తెలుస్తోందని కేజ్రీ విమర్శించారు.

ఇది ఆర్భాటపు ప్రకటన: హరీశ్‌రావత్



అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్రం చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్ స్పందించారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఇలాంటి ఆర్భాటమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. చాలాకాలం నాన్చి ఇప్పుడు ఆర్భాటంగా ప్రకటన చేశారని, ఐదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. అబద్ధాలతోనే ఇన్నేళ్లూ కాలం గడిపిన బీజేపీకి ప్రజలు చరమగీతం పాడతారని, ఈ ప్రభుత్వాన్ని ఎవరూ కాపాడలేరని ఆయన అన్నారు.

మోదీ చివరి బాణం ఇది: హార్దిక్ పటేల్



అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పటీదార్ రిజర్వేషన్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ స్పందించారు. మోదీ 'తూణీరంలో చివరి బాణం' ఇదేనని అన్నారు. ఇది ప్రజలకు ఇచ్చిన 'లాలీపాప్' అయితే అది తప్పే అవుతుందన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చడంలో విఫలమైన పక్షంలో ప్రజలే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్రం తీసుకున్న కోటా నిర్ణయానికి రాజ్యాంగ సవరణ కీలకమని, ఆ దిశగా అడుగు పడాల్సి ఉంటుందని హార్దిక్ పటేల్ అన్నారు.

స్వాగతించిన పినరయి విజయన్



కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని కేరళ సీఎం పినరయి విజయన్ స్వాగతించారు. ఎన్నో ఏళ్లుగా సీపీఎం పార్టీ దీన్ని డిమాండ్ చేస్తోందన్నారు. రిజర్వేషన్ వ్యవస్థను దెబ్బతీసేందుకు ప్రయత్నించారని, కానీ అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్ ఇవ్వడం సముచితమైన నిర్ణయమన్నారు. ఎట్టకేలకు రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకున్నారని, ఇది స్వాగతించదగ్గ పరిణామం అని సీఎం విజయన్ తెలిపారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఈ అంశంపై స్పందించారు. రిజర్వేషన్ల నిర్ణయంతో మోదీ ఎన్నికల నగారా మోగించారని ఒమర్ ట్వీట్ చేశారు. ఆ ఢంకా కూడా భారీగానే మోగిందన్నారు.

రక్షణ మంత్రివి అబద్ధాలు

• హాల్‌కు లక్ష కోట్లు ఇవ్వలేదు • పార్లమెంట్‌లో అసత్యాలు చెప్పారు



న్యూఢిల్లీ, జనవరి 7: రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో అసత్యాలు చెప్పారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థకు లక్ష కోట్లు ఇచినట్లు రక్షణ మంత్రి చెప్పారు. దాన్ని మేం సవాల్ చేశాం, అయితే ఆ అంశాన్ని సోమవారం ఆమె మరోలా చెప్పారన్నారు. హెచ్ఏఎల్‌కు కేవలం 26 వేల కోట్లు ఇచ్చినట్లు సీతారామన్ ఇవాళ పార్లమెంట్‌లో మళ్లీ తెలిపారు. దీన్ని లేవనెత్తుతూ రాహుల్.. రక్షణ మంత్రిపై ఫైర్ అయ్యారు. రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు సమయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని ఎయిర్‌ఫోర్స్, రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు అడ్డుకున్నారా లేదా అన్న విషయాన్ని కూడా చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాల్లేక ఇబ్బందులు పడుతున్న హాల్‌కు కేంద్రం వాస్తవానికి అలాంటి ఆర్డర్లు ఇవ్వలేదంటూ ఓ జాతీయ మీడియా సంస్థ ప్రచురించిన కథనాన్ని ఆయన ప్రముఖంగా ఉటంకించారు. ఈ కథనంపై వివరణ ఇవ్వాలనీ... లేదా రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. హాల్‌కు రూ. లక్ష కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చామనీ.. కానీ కాంగ్రెస్ మొసలి కన్నీరు కార్చుతోందంటూ శుక్రవారం నిర్మల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.. ఇదే విషయాన్ని ఇవాళ కూడా ఆమె పునరుద్ఘాటించడంతో రాహుల్ స్పందిస్తూ.. ''పచ్చి అబద్ధం చెబుతూ పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తున్నారు. హాల్‌కు కావాల్సిన వాస్తవ మొత్తం రూ.26,570 కోట్లు. మిగతా రూ.73 వేల కోట్ల ఆర్డర్లు అనేది అర్థరహితం...'' అని పేర్కొన్నారు. ''నేను ప్రధాని మోదీని, రక్షణ మంత్రి నిర్మలను ఒకటే అడుగుతున్నాను... మోదీ ఎప్పుడు బైపాస్ సర్జరీ చేయించుకుని కొత్తగా 36 యుద్ధ విమానాల కాంట్రాక్టు కోసం సిద్ధమవుతారు? మోదీ జోక్యాన్ని సీనియర్ రక్షణ మంత్రి నిర్మలగానీ, డిఫెన్స్ అధికారులు గానీ అడ్డుకోలగరా? అవునా, కాదా చెప్పండి..'' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 126 యుద్ధ విమానాల కోసం ఫ్రాన్స్‌తో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

లక్ష కోట్ల కాంట్రాక్టులు నిజమే

- నేను చెప్పినదంతా అక్షర సత్యం
- హెచ్ఏఎల్ కూడా నిర్ధరించింది
- రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, జనవరి 7: హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు లక్ష కోట్ల రూపాయల కాంట్రాక్టులు ఇచ్చిన విషయమై తాను చెప్పినదంతా అక్షర సత్యమని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో స్పష్టం చేశారు. తాను హెచ్ఏఎల్ వర్గాలతో కూడా ఈ విషయాన్ని నిర్ధరించుకున్నానని, 2014 నుంచి 201 వరకు రూ.26,570 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చేందుకు ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయని, మరో రూ.73వేల కోట్ల కాంట్రాక్టుల ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయని ఆమె చెప్పారు. దీన్నిబట్టే తాను చెప్పిన విషయం నిజమనేది తెలుస్తోందని, దీనిపై ప్రతిపక్షాలు లేవనెత్తిన అనుమానాలన్నీ తప్పులు, తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని అన్నారు. అయితే.. ఆమె చెప్పిన సమాధానంతో కాంగ్రెస్ పార్టీ సభ్యులు సంతృప్తి చెందలేదు. అలాంటప్పుడు హెచ్ఏఎల్ తన ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ఎందుకు ఇబ్బంది పడుతోందో ప్రభుత్వం వివరించలేదని అడిగారు. హెచ్ఏఎల్ నిధుల కొరతతో అల్లాడుతోందన్న విషయాన్ని రుజువు చేసే ఒక లేఖను కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే చదివి వినిపించారు. అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ సంస్థను ఆదుకోడానికి 36 రఫేల్ జెట్ విమానాలను అధిక ధరకు డసాల్ట్ నుంచి ప్రభుత్వం కొంటోందని, కానీ హెచ్ఏఎల్ మాత్రం కనీసం జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని అన్నారు. మరోవైపు రక్షణ మంత్రి పార్లమెంటులో ప్రకటన చేసిన కొద్ది సేపటికే రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో దీనిపై మరో విమర్శ చేశారు. ''హెచ్ఏఎల్ వద్ద జీతాలు చెల్లించడానికి తగినన్ని నిధులు లేవు. అనిల్ అంబానీకి రఫేల్ దక్కింది. ఇప్పుడాయనకు హెచ్ఏఎల్‌లో ఉన్న తెలివైన వ్యక్తులు అవసరం అవుతారు. హెచ్ఏఎల్‌లో జీతాల్లేవు కాబట్టి అక్కడున్న మంచి ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు తప్పనిసరిగా అనిల్ అంబానీ కంపెనీకి వెళ్తారు'' అని అందులో ఆయన తెలిపారు. సభను తప్పుదోవ పట్టించినందుకు నిర్మలా సీతారామన్ సభాహక్కుల తీర్మానాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ సభ్యుడు కేకే వేణుగోపాల్ అన్నారు. ప్రతిపక్ష సభ్యులు పదే పదే నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తుండటంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ నలుగురు సభ్యులను సస్పెండ్ చేసి లోక్‌సభను వాయిదా వేశారు.

మత్తు.. అశ్లీల నృత్యాలు..

- **ఆపై అత్యాచారాలు, హత్యలు!**
- **వెలుగులోకి ముజఫర్‌పూర్ వసతి గృహం అరాచకాలు**
- **విస్తుగొలిపేలా సీబీఐ చార్జ్‌షీట్**


పట్నా, జనవరి 7: ముజఫర్‌పూర్ వసతి గృహాల్లో జరిగిన దారుణాలను సీబీఐ కళ్లకు కట్టినట్టు తన నివేదికలో వెల్లడించింది. బిహార్‌లోని ఈ షెల్టర్ హోంలో అమాయక బాలికలకు మత్తు మందులు ఇచ్చి, వారు స్పృహ తప్పి పడిపోయాక వసతి గృహం యజమాని బ్రజేష్ ఠాకూర్ వారిపై అఘాయిత్యాలకు పాల్పడి.. ఆతరువాత కొందరిని హత్య చేసినట్టు తేలింది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది సాయంతోనే ఈ అరాచకాలు నిక్షేపంగా, నిరాటంకంగా సాగాయి. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో.. అమ్మాయిలను కుర్చీలకు కట్టేసి ఠాకూర్, ఆయన వద్దకు వచ్చిన అతిథులు ఈ అత్యాచారాలకు పాల్పడ్డాడు. అశ్లీలమైన భోజ్‌పురీ పాటలకు నృత్యాలు కూడా చేయించాడు. ఇక పదేపదే హోంలోని అమ్మాయిలపై చేయిచేసుకుని వీపు విమానం మోత మోగించడం ఇతనికున్న మరో అలవాటు. కట్టెలతో బాదడం కూడా చేశాడు..ఈ తతంగంలో బాధను భరించలేక బాధిత అమ్మాయిలు చేసిన ఆర్తనాదాలు పట్టించుకున్న నాథుడే లేడు. సీబీఐ దాఖలు చేసిన 73 పేజీల చార్జ్‌షీట్‌లో ఇక్కడి బాలికా గృహంలో జరుగుతున్న ఈ ఆకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. నిద్ర లేచేసరికి విపరీతమైన నొప్పులతో తాము ప్రత్యక్ష నరకంలో ఉన్నట్టు బాధ పడ్డట్టు బాధితులు సీబీఐకి వివరించారు.



మత్తివ్వడం సిబ్బంది పని


మరోవైపు ఇక్కడ పనిచేస్తున్న వారు తమను ఎర్రగా కాల్చిన గిన్నెలతో చితకబాదేవారు. బాధిత అమ్మాయిల్లో ఒకరిని తలపై బలంగా మోది ఠాగూర్ హత్యచేయగా మరో అమ్మాయి పనివాళ్ల చేతిలో ప్రాణాలు కోల్పోయింది. కిరణ్ అనే ఓ సహాయకుడు అమ్మాయిల మధ్య నగ్నంగా పడుకునేవాడని మరో బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మత్తుమందులు ఇవ్వడం ఇక్కడి సహాయకుల ప్రధాన కర్తవ్యం. షెల్టర్ హోంలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా ఈ అత్యాచారాల్లో పాలుపంచుకున్నారు. ముజఫర్‌పూర్ చైల్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ దిలీప్ కుమార్ వర్మా కూడా నిందుతుల్లో ఒకరు కావడం విశేషం. జిల్లా శిశు సంక్షేమ కమిటీ ఛైర్మన్‌తో పాటు పలువురు అధికారులు నిందితుల్లో ఉన్నారు.

ఈ వసతి గృహాన్ని 11 సార్లు పర్యవేక్షించిన మరో అధికారి మొత్తం వ్యవహారంపై నోరుమెదపకుండా ఉండడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. పోస్కో చట్టం కింద ఈ చార్జ్‌షీట్‌ను సీబీఐ దాఖలు చేసింది. గతేడాది టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ ముజఫర్‌పూర్ వసతి గృహంపై బుట్టదాఖలా చేసే వరకూ బయటి ప్రపంచానికి ఇక్కడ ఏం జరుగుతోందో తెలియకపోవడం విశేషం. దేశంలోని పలు షెల్టర్ హోంల్లో ఇవే ఆకృత్యాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో పాటు మరో 16 ఘటనలు బిహార్‌లో వెలుగులోకి రావడంతో వీటిపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తుండగా.. మొత్తం ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలను తనిఖీ చేయాలని ఆదేశించింది.



అఖిలేష్‌కు మాయావతి మద్దతు

లఖ్‌నవూ, జనవరి 7: మైనింగ్ స్కామ్‌లో యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌ను సీబీఐ ప్రశ్నించనుందనే వార్తల నేపథ్యంలో బీఎస్పీ చీఫ్ మాయావతి సోమవారం అఖిలేష్‌కు బాసటగా నిలిచారు. దాడుల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టే బీజేపీ వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని మాయావతి పేర్కొన్నారు. కేంద్రం వేధింపులను ధైర్యంగా ఎదుర్కొని, కుట్రలను నీరుగార్చాలని అఖిలేష్‌తో భేటీ సందర్భంగా మాయావతి స్పష్టం చేశారని బీఎస్పీ ఓ ప్రకటనలో పేర్కొంది. 2012-13లో మైనింగ్ గనుల కేటాయింపు ప్రక్రియలో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను ఉల్లంఘించిన అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదైతే దానికి అప్పటి సీఎం అఖిలేష్ యాదవ్ బాధ్యులు ఎలా అవుతారని సోమవారం ఎస్పీ, బీఎస్పీ నేతల సంయుక్త సమావేశంలో బీఎస్పీ ఎంపీ సతీష్ మిశ్రా ప్రశ్నించారు.



పి.ఎం.నరేంద్ర మోదీ ఫస్ట్ లుక్

ప్రస్తుతం ఇండియన్ సినిమాలో బయోపిక్స్ ట్రెండ్ జోరుగా కొనసాగుతుంది. సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖుల బయోపిక్స్ రూపొందుతున్నాయి. ఆ కోవలో ఇప్పుడు మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్ 'పిఎం నరేంద్ర మోదీ' ఆవిష్కృతం కానుంది. 'దేశభక్తే నా శక్తి' ట్యాగ్ లైన్. 'రక్తచరిత్ర', 'వినయవిధేయరామ' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన బాలీవుడ్ నటుడు.. వివేక్ ఒబెరాయ్ ఇందులో మోదీ పాత్రలో కనిపించబోతున్నారట. బి.ఓమంగ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కబోయే ఈ సినిమాకు సురేష్ ఒబెరాయ్, సందీప్ ఎస్.సింగ్ నిర్మాతలు. 23 భాషల్లో ఈ బయోపిక్‌ను విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

రామ్‌తో మణిశర్మ





రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించనున్నారు. ఆరోసారి వీళ్ళిద్దరూ కలిసి పని చేయబోతున్నారు. గతంలో పూరీ జగన్నాథ్, మణిశర్మ కలిసి పని చేసిన ఐదు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ ఇద్దరూ చివరగా 'టెంపర్' సినిమాకు కలిసి పనిచేశారు. ఆ చిత్రానికి నేపథ్య సంగీతం అందించారు మణిశర్మ. ఇప్పుడు రామ్ హీరోగా నటిస్తున్న ఇస్మార్ట్ శంకర్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు మణిశర్మ. రామ్, మణిశర్మ కాంబినేషన్‌లో రానున్న తొలి సినిమా ఇదే. యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ జనవరి చివర్లో మొదలు కానుంది. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ నిర్మాణ సంస్థలపై దర్శకుడు పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



మన్మోహన్ సింగ్ బయోపిక్‌కి ఊరట

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన సినిమా 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు ఆరోపిస్తున్నారు. ఈ సినిమా విడుదల కానివ్వమని హెచ్చరిస్తున్నారు. మరికొంత మంది ఆ ట్రైలర్‌ను నిషేధించాలంటూ ఢిల్లీ హై కోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను సీరియస్‌గా తీసుకోని న్యాయస్థానం కొట్టి వేసింది. అయితే సినిమాపై ఏమైనా అభ్యతరం ఉంటే మన్మోహన్ సింగ్‌కు ముందే చూపిస్తామని చిత్ర యూనిట్ ఇంతకుముందు హామీ ఇచ్చింది. ఈ చిత్రంలో మన్మోహన్ సింగ్‌గా అనుపమ్ ఖేర్ నటించారు. విజయ్ రత్నాకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు ఆయనకు అధికార ప్రతినిధిగా పనిచేసిన సంజయ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని జనవరి 11న విడుదల చేస్తున్నారు.



అక్కడ రాశి హవా!

తెలుగులో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్న రాశీ ఖన్నా ఇప్పుడు తమిళ సినిమాల్లో ఎక్కువగా నటిస్తోంది. ఈమధ్య ఆమె నటించిన రెండు సినిమాలు విజయం సాధించాయి. అంతే కాదు అక్కడి స్టార్ హీరోలందరితోనూ నటిస్తోంది. తొలి చిత్రంలోనే నయనతార, విజయ్‌సేతుపతి, అధర్వ వంటి స్టార్స్‌తో నటించే అవకాశం వరించడం, ఆ చిత్రం సక్సెస్ కావడంతో రాశీఖన్నా పేరు పాపులర్ అయింది. అలాగే జయం రవితో కలిసి 'అడంగుమరు' చిత్రంలో నటించింది. ఈ సినిమా కూడా విజయం సాధించడంతో రాశీ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకుంది. 'ఇమైకానోడిగళ్' చిత్రంలో నటించినా నయనతార, విజయ్‌సేతుపతిలతో కలిసి నటించే అవకాశం లేకపోవడం బాధాకరమేనంది. అయితే విజయ్‌సేతుపతికి జంటగా నటించాలని తాను కలలు కంటున్నానని చెబుతోంది రాశి. ఇక నటుడు విజయ్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందిన తెరి, మెర్శల్ చిత్రాలను చూశానని, వారి కాంబినేషన్ అంటేనే యమ క్రేజ్ అని పేర్కొంది. ఆ కాంబినేషన్‌లో నటించే అవకాశం రావాలని కోరుకుంటున్నానని రాశీఖన్నా చెప్పింది. ప్రస్తుతం ఈ బ్యూటీ విశాల్‌కు జంటగా అయోగ్య, సిద్ధార్థ్‌తో సైతాన్ కా బచ్చా చిత్రాల్లో నటిస్తోంది.



శ్రీదేవి బయోపిక్‌కి బోనీ నిర్మాత

జాతీయ స్థాయిలో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో ఒకరు అందాల తార శ్రీదేవి. దక్షిణాది చిత్రాలతోపాటు హిందీలోనూ పలు సూపర్‌హిట్ చిత్రాల్లో నటించిన ఆమె హఠాత్తుగా చనిపోవడం అందర్నీ బాధించింది. దేశవ్యాప్తంగా చక్కని ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న ఆమె జీవితాన్ని తెరకెక్కించేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వాళ్ళందరి కంటే శ్రీదేవి బయోపిక్‌ను నిర్మించే అర్హత తనకే ఉందని ఆమె భర్త బోనీకపూర్ భావిస్తున్నారు. ''శ్రీదేవి బయోపిక్‌ను తియ్యాలన్న ఆలోచన బోనీ కపూర్‌ది. ఆ దిశగా ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. శ్రీదేవి గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తి బోనీ కపూర్ కావడంతో ఆ సినిమాకు అతని వల్లే న్యాయం జరుగుతుంది. ఆమె జీవితంపై సినిమా తీసేందుకు కాపీ రైట్స్ కూడా ఆయనే తీసుకోబోతున్నారు'' అని బోనీ కపూర్ సన్నిహిత వర్గాలు చెప్పినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. శ్రీదేవి జీవితాన్ని పుస్తక రూపంలో తీసుకురావడానికి పలువురు రచయితలు, పాత్రికేయులు బోనీని కలిశారట. వారిలో ఒకరికి ఆ బాధ్యతను అప్పగిస్తున్నారని సమాచారం.



● సుజీ

కమల్‌తో దక్షిణ కొరియా భామ

కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం 'ఇండియన్ 2'. 22 ఏళ్ల తర్వాత వీరి కలయికలో రాబోతున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ నెల 18 నుండి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించనుంది. ఈమెతో పాటు సుజీ బే అనే దక్షిణ కొరియా భామ నటించనుందని సమాచారం. ఓ కొరియన్ నటి తమిళ సినిమాలో నటించనుండటం ఇదే ప్రథమం. చెన్నై, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు తైవాన్, ఉక్రెయిన్‌లో చిత్రీకరణ జరగనుంది. ఈ సినిమా కోసం కాజల్ కత్తిసాము వంటి విద్యలను కూడా నేర్చుకుంటుంది. కమల్ హాసన్ బరువు తగ్గుతున్నారు.



హిట్‌తో వారికి బుద్ధి చెబుతా - అశోక్ వల్లభనేని

రజినీకాంత్ హీరోగా నటిస్తున్న చిత్రం 'పేట'. సిమ్రాన్ , త్రిష కథానాయికలు. ఈ సినిమా జనవరి 10 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ ''నవాబ్, సర్కార్ లాంటి సూపర్ హిట్ సినిమాలను రిలీజ్ చేసిన ప్రొడ్యూసర్ వల్లభనేని అశోక్‌గారికి రజినీకాంత్‌గారు నటించిన ఈ సినిమా కూడా అంతకన్నా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. ఈ సంక్రాంతికి వచ్చే అన్ని సినిమాలతో పాటు ఈ సినిమా కూడా బాగా ఆడాలి'' అన్నారు. దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ ''సినిమా పట్ల ఎంతో ఫ్యాషన్ , ఆసక్తి కలిగిన నిర్మాత వల్లభనేని అశోక్.. టాలీవుడ్‌లో దియేటర్ల సమస్య ఉన్నా కూడా అలాంటి టైంలో స్టార్ కాస్ట్‌ని, సినిమా పట్ల ఇష్టంతో సినిమాలు రిలీజ్ చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.. అయన చేసిన పెద్ద సాహసం ఇది. ఈ సినిమా తప్పక బాగుంటుంది.. అందరూ ఆదరించాలి'' అన్నారు. నిర్మాత వల్లభనేని అశోక్ మాట్లాడుతూ. ''రజినీకాంత్‌గారి స్ఫూర్తితోనే అయన సినిమా చేసే స్థాయికి చేరుకున్నాను.. సినిమా థియేటర్స్ విషయంలో చాలా మంది నన్ను ఇబ్బంది పెడుతున్నారు.. వాళ్లకు ఈ సినిమా హిట్‌తో బుద్ధి చెప్పాలనుకుంటున్నాను.. దయచేసి ఈ సమస్యను పరిష్కరించాలని కెసిఆర్‌గారిని కోరుకుంటున్నాను'' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ మాట్లాడుతూ. ''ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్న ప్రొడ్యూసర్ అశోక్‌గారికి అభినందనలు'' అన్నారు.. నటుడు బాబీ సింహ మాట్లాడుతూ ''రజినిగారితో పనిచేశాననే ఆలోచనే నాకు ఎంతో సర్‌ప్రైజింగ్‌గా ఉంది.. దేవుడిని చుశాననే ఫీలింగ్ కలిగింది.. కార్తీక్‌గారు ఈ పాత్రకు నన్ను ఎంచుకున్నందుకు చాలా థాంక్స్'' అన్నారు. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ ''సినిమాను రిలీజ్ చేస్తున్న అశోక్‌గారికి కంగ్రాట్స్.. సినిమా చాలా బాగుంటుంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్, యాక్షన్ ఫిలిం ఇది. మీ అందరూ ఈ సినిమాను చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి సినిమాని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు.



● స్టెఫీ, వంశీ

ఫిబ్రవరిలో 'నిన్ను తలచి'

ఎస్.ఎల్.ఎం ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకత్వంలో నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో వంశీ, స్టెఫీ పాటెల్ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అజిత్ మాట్లాడుతూ ''కొత్త హీరో, హీరోయిన్‌తో కొత్త బేనర్‌లో చేస్తున్న ఈ సినిమా అందరికీ మంచి పేరు తెస్తుంది'' అన్నారు. హీరోయిన్ స్టెఫీ పటేల్ మాట్లాడుతూ ''టాలీవుడ్‌లో నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు'' అన్నారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి సినిమా చేసాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. హీరో వంశీ మాట్లాడుతూ ''నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్'' అని అన్నారు.

గోల్డెన్ గ్లోబ్ అవార్డుల సందడి



76వ గోల్డెన్ గ్లోబ్ అవార్డుల సందడి ప్రారంభమైంది. సోమవారం ఉదయం కాలిఫోర్నియాలోని ది బెవర్లీ హిల్స్ ప్రాంతంలో ఈ వేడుక జరిగింది. హాలీవుడ్‌కి చెందిన సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముందు ఈ వేడుకను నిర్వహిస్తారు. ఈ వేడుకకు హాలీవుడ్ నటులు ఆండీ సామ్‌బర్గ్, సాండ్రా ఓహ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. హాలీవుడ్‌లో 'మీటూ' ఉద్యమం గందరగోళాన్ని సృష్టించిన నేపథ్యంలో ఈ ఏడాది చాలామంది సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరు కాలేదు. ఇక గోల్డెన్ గ్లోబ్ అవార్డుల విజేతలను ఒకసారి పరిశీలిస్తే... ఉత్తమ చిత్రంగా గ్రీన్ బుక్, ఉత్తమ దర్శకుడుగా అల్ఫానోస్ కార్వోన్, ఉత్తమ నటిగా, ఒలీవియా కోల్మన్, ఉత్తమ నటుడుగా క్రిస్టియన్ బేల్, ఉత్తమ సహాయ నటుడుగా మహర్షెలా అలీ, ఉత్తమ సహాయ నటిగా రెజీనా కింగ్, ఉత్తమ టీవీ సిరీస్‌గా ది అసాసినేషన్ ఆఫ్ గియాన్నీ వర్సాచీ, ఉత్తమ విదేశీ చిత్రంగా రోమా అవార్డులు అందుకున్నారు.



సెన్సెక్స్ టాప్ గెయినర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
యాక్సిస్ బ్యాంకు	+2.84	రూ. 637.45
టాటా మోటార్స్	+2.64	రూ. 175.25
టాటా మోటార్స్-డీవీఆర్	+2.57	రూ. 93.85
ఎన్‌టీపీసీ	+1.89	రూ. 148.40
ఇన్ఫోసిస్	+1.57	రూ. 671.15
మారుతి సుజుకి	+1.54	రూ. 7,349
పవర్ గ్రిడ్ కార్పొరేషన్	+1.46	రూ. 198.40
ఓఎన్‌జీసీ	+1.30	రూ. 147.55
టీసీఎస్	+1.21	రూ. 1,896.65
ఏషియన్ పేయింట్స్	+0.69	రూ. 1,394.80

సెన్సెక్స్ టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
బజాజ్ ఆటో	-2.82	రూ. 2,657.40
ఎస్ బ్యాంకు	-1.35	రూ. 186.95
హీరో మోటోకార్ప్	-1.11	రూ. 2,959.35
బజాజ్ ఫినాన్స్	-1.03	రూ. 2,552.65
సన్ ఫార్మా	-0.64	రూ. 430.05
ఎస్‌బీఐ	-0.61	రూ. 295.70
కోల్ ఇండియా	-2.64	రూ. 234.30
లార్సెన్ టూబ్రో	-0.39	రూ. 1,389.95
టాటా స్టీల్	-0.36	రూ. 485.95
హెచ్‌డీఎఫ్‌సీ	-0.01	రూ. 1,971

నిఫ్టీ టాప్ గెయినర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
భారతీ ఇన్‌ఫ్రా	+3.05	రూ. 293.75
యాక్సిస్ బ్యాంకు	+2.88	రూ. 637.45
టాటా మోటార్స్	+2.57	రూ. 175.35
ఎన్‌టీపీసీ	+1.96	రూ. 148.60
గ్రాసిమ్	+1.80	రూ. 820.65
మారుతి సుజుకి	+1.76	రూ. 7,362.05
టైటాన్ కంపెనీ	+1.68	రూ. 944.05
ఇన్ఫోసిస్	+1.61	రూ. 671.70
ఓఎన్‌జీసీ	+1.48	రూ. 147.85

నిఫ్టీ టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
ఇండియాబుల్స్	-4.33	రూ. 793.90
బజాజ్ ఆటో	-2.77	రూ. 2,658.55
డాక్టర్ రెడ్డీస్	-1.59	రూ. 2,558.65
ఐషర్ మోటార్స్	-1.36	రూ. 19,830.40
ఎస్ బ్యాంకు	-1.32	రూ. 186.15
హిందాల్కో	-1.11	రూ. 208.55
బీపీసీఎల్	-1.08	రూ. 208.55
హీరో మోటోకార్ప్	-1.00	రూ. 2,957.95
బజాజ్ ఫినాన్స్	-0.87	రూ. 2,553.60
కోల్ ఇండియా	-0.85	రూ. 234.50

లాభాల్లో స్టాక్ మార్కెట్లు

ఆటుపోట్ల నడుమ రాణించిన సూచీలు

- **155 పాయింట్ల లాభంతో 35,850 వద్ద సెన్సెక్స్ ముగింపు**
- **44 పాయింట్లు పుంజుకున్ననిఫ్టీ 10,771 వద్ద ముగింపు**
- **ఫార్మా రంగంలో పెరిగిన అమ్మకాలు**
- **సెన్సెక్స్ గరిష్ట స్థాయి 350 పాయింట్లు**
- **నిఫ్టీలో అత్యధిక షేర్లు లాభాల్లోనే**





ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ట్రేడింగ్ ప్రారంభించినప్పటికి సెషన్ ముగిసే సమయానికి లాభాలతో ముగిసింది. ఒకానొక సమయంలో 350 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్ చివరకు 155 పాయింట్ల లాభంతో 35,850 వద్ద ముగిసింది. అటు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి నిఫ్టీ కూడా 10,800 మార్క్‌కు పైన కదలాడి చిరవకు 44 పాయింట్ల లాభంతో 10,771 వద్ద ముగిసింది. ప్రైవేట్ రంగ బ్యాంకులు, వాహన, ఐటీ స్టాక్స్ లాభాలు ఇండెక్స్‌ల పెరుగుదల కారణంగా మార్కెట్లు లాభాల్లో ముగిశాయని స్టాక్ బ్రోకర్లు తెలిపారు. అమెరికా, చైనా వాణిజ్య చర్చలు, ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు విరామ సంకేతాలు వంటి అంశాలు కూడా సానుకూల ప్రభావం చూపాయని తెలిపారు. రూపాయి బలపడటం కూడా బుల్స్ జోరుకు దోహదపడిందని పేర్కొన్నారు. భారీ గ్యాప్‌అప్‌తో ప్రారంభమైన ఇండెక్స్‌లు తర్వాత అదే లాభాలను చివరి వరకు కొనసాగించలేకపోయాయి. ముఖ్యంగా ఫార్మా రంగంలో ఇటీవల నమోదైన లాభాల స్వీకరణకు మదుపరులు ఎక్కువ ఆసక్తి చూపడంతో మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనైనప్పటికీ తేరుకోవడం విశేషమని బ్రోకర్లు తెలిపారు. యూరోపియన్ మార్కెట్లు బలహీనంగా ప్రారంభమవ్వడం, ఎస్ అండ్‌పీ 500 ఫ్యూచర్స్ పడిపోవడం వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపాయని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. నిఫ్టీ 50లో 32 షేర్ల పెరిగితే.. 18 స్టాక్స్ నష్టపోయాయి. అదే సెన్సెక్స్‌లో 21 స్టాక్స్ లాభాల్లో మిగతావి నష్టాల్లో క్లోజయ్యాయి. నిఫ్టీ 50లో యాక్సిస్ బ్యాంక్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టాటా మోటార్స్, టైటాన్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభాల్లో ముగిశాయి. అదేసమయంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యస్ బ్యాంక్, ఐషర్ మోటార్స్ షేర్లు నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్ షేరు గరిష్టంగా 3 శాతం మేర పెరిగితే, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ గరిష్టంగా 5 శాతం మేర పడిపోయింది. సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ మిశ్రమంగా ముగిశాయి. మెటల్, ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకు షేర్ల ఇండెక్స్‌లు నష్టపోయాయి. ఇక మిగతా ఇండెక్స్‌లు లాభాల్లోనే ముగిశాయి. కాగా, సోమవారం నాటి ట్రేడింగ్‌లో యాక్సిక్ బ్యాంకు, టాటా మోటార్‌స, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు లాభాలనివ్వగా ఎస్‌బ్యాంకు, హీరో మోటార్స్, బజాజ్ ఫినాన్స్, సన్ ఫార్మా, బీపీసీఎల్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇక డాలర్‌తో రూపాయి విలువ రూ. 69.91 వద్ద ట్రేడ్ అయింది.

బులియన్‌లో లాభాలే

- **బంగారం ధర రూ. 150 అప్**
- **40 వేల మార్క్‌ను దాటిన కిలో వెండి**



న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో బంగారు, వెండి జోరందుకున్నాయి. సోమవారం దేశీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల మద్దతు కారణంగా బంగారం ధర రూ. 150 పెరిగింది. పది గ్రాముల బంగారం ధర రూ. 32,650కి చేరింది. అంతర్జాతీయ పరిణామాలు, డాలరు విలువ పడిపోవడంతో పాటు బంగారు ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో పసిడి ధర పుంజుకున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. పసిడి బాటలోనే వెండి పయనిస్తోంది. గత వారం స్వల్పంగా తగ్గిన వెండి ధర మళ్లీ పుంజుకొని రూ. 40వేల మార్క్‌ను దాటింది. రూ. 410 పెరగడంతో కేజీ వెండి రూ.40,010కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. అటు అంతర్జాతీయంగా పసిడి ధర పెరుగుదలను నమోదు చేసుకుంది. న్యూయార్క్ మార్కెట్లో బంగారం ధర 0.33శాతం పెరగడంతో ఔన్సు 1,289.50 డాలర్లుగా నమోదైంది.

2018-19లో జీడీపీ వృద్ధి @ 7.2%



ముంబై: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవ త్సరం (2018-19) 7.2 శాతంగా నమోదు కావొచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. కాగా 2017-18లో జీడీపీ వృద్ధి రేటు అంచనా 6.7 శాతమే కావడం గమనార్హం. కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) తాజాగా జీడీపీ గణాంకాలను వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో వృద్ధి రేటు 8.2 శాతంగా, రెండో అర్ధ భాగంలో వృద్ధి రేటు 7.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వ్యవసాయ రంగ వృద్ధి రేటు 3.8 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి అంచనాలు 3.4 శాతంగా ఉన్నాయి.


19వ స్టోర్‌ను ప్రారంభించిన మ్యాక్స్



హైదరాబాద్: ప్రముఖ దేశీయ ఫ్యాషన్ బ్రాండ్ మాక్స్ సంస్థ హైదరాబాద్‌లో తమ 19వ స్టోర్‌ను సోమవారం ప్రారంభించింది. సికింద్రాబాద్‌లోని మహాత్మగాంధీ రోడ్‌లో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ల మాక్స్ టెరిటరి అధిపతి ప్రశాంత్ పాల్ మూఖ్య అతిథిగా హాజరై మాక్స్ స్టోర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మా వినియోగదార్లను సంతృప్తి పరచడానికి తామెప్పుడూ ముందుంటామని అందులో భాగంగానే హైదరాబాద్‌లో ఆదరణను అందిపుచ్చుకునేందుకు స్టోర్లను విస్తరిస్తున్నట్లు తెలిపారు. సరికొత్త ఫ్యాషన్ దుస్తులతో పాటు సీజన్‌లకు తగ్గట్లుగా స్మార్ట్ క్యాజువల్ క్లాతింగ్‌ను కలిగి ఉండటం తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. కాగా, దేశంలో అత్యుత్తమ బ్రాండ్లలో ఒకటిగా పేరున్న మాక్స్‌కు 90 పట్టణాల్లో 250 స్టోర్లు ఉన్నాయి.

కోర్టు ధిక్కరణ కేసులో అనిల్ అంబానీకి నోటీసులు

- **నాలుగు వారల్లో సమాధానం కోరిన దేశ అత్యున్నత న్యాయస్థానం**
- **ఎరిక్‌సన్ పిటీషన్‌పై సుప్రీం కోర్టు స్పష్టత**





న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ అనిల్ అంబానీకి దేశ అత్యున్నత న్యాయ స్థానం నోటీసులు జారీ చేసింది. ఎరిక్‌సన్ ఇండియా దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై స్పందన కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేసింది. దీనికి నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాల్సిందిగా జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్ నేత త్వంలోని ధర్మాసనం అంబానీ, ఇతరులను ఆదేశించింది. అయితే బకాయి కింద రూ. 118కోట్లను అంగీకరించాల్సిందిగా ఆర్‌కాం తరపున వాదించిన న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహతగి కోర్టును కోరారు. అయితే ఎరిక్‌సన్‌దీనికి ససేమిరా అంది. మొత్తం బకాయిని డిపాజిట్ చేయాలని తేల్చి చెప్పింది. దీంతో కోర్టు రిజిస్ట్రీలో రూ. 118 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను డిపాజిట్ చేయాల్సింగా ఆర్‌కాంను కోరింది. అలాగే రిలయన్స్ జియోతో కూర్చొని చర్చించి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా ఆర్‌కాంకు నారిమన్ సూచించారు. పరస్పరం సమస్యను పరిష్కరించుకోని పక్షంతో తామేమి చేయలేమని వ్యాఖ్యానించారు. మరోవైపు స్పెక్ట్రం ట్రేడ్ మార్గదర్శకాలకు కట్టుబడి ఆర్‌కాం కొనుగోళ్లపై సిద్ధంగా ఉన్నారా అని జియోను కూడా కోర్టు ప్రశ్నించింది. అయితే ముందస్తు బకాయిలతో ఉన్న సమస్యల నేపథ్యంలో, ఆర్‌కాంకు ఫిజికల్ గ్యారంటీ ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని జియో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టుకు తెలిపారు. స్వీడిష్ టెలికాం పరికరాల తయారీదారు ఎరిక్‌సన్ ఇటీవల ఆర్‌కాంపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. అనిల్ అంబానీని అరెస్టు చేయాలని, దేశం విడిచి పారిపోకుండా నియంత్రించాలంటూ ఎరిక్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. బకాయిల చెల్లింపునకు వ్యక్తిగతంగా హామీ ఇచ్చిన అనిల్ అంబానీ గడువు తీరినా స్పందించడం లేదని, తద్వారా కోర్టు గడువును కూడా ఉల్లంఘించారని ఎరిక్‌సన్ తన పిటిషన్‌లో పేర్కొంది. కాగా, ఎరిక్సన్ తన పిటీషన్‌లో అనిల్ అంబానీని దేశం విడిచి వెల్లకుండా చూడాలని కూడా కోర్టును కోరింది. ఇదిలా ఉండగా తన అన్న ముఖేశ్ అంబానీకి ఆర్‌కాంను విక్రయించే సన్నాహాలకు ఇటీవల అడ్డుకట్టపడటంతో ఇరు కంపెనీల మధ్య ఉన్న ఒప్పందాన్ని పొడగించుకుంటున్నట్లు ఒక ప్రకటనలో రెండు కంపెనీలు పేర్కొన్నాయి. అనిల్ కోర్టు నోటీసులను ఎలా ఎదుర్కొంటారనే అంశంపై వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చలకు దారి తీస్తోంది.

చమురుపై అంచానాలు తగ్గింపు

నిల్వలు పెరగటమే ప్రధాన కారణం





న్యూఢిల్లీ: కొత్త ఏడాదికి బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర అంచనాలను అంతర్జాతీయ బ్రోకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ 62.50 డాలర్లకు తగ్గించింది. అమెరికా షేల్ గ్యాస్ ఉత్పత్తి పెరుగుదల, చమురు మిగులు అధికం కావడంతో ఏడాది అంచనాలను 70 డాలర్లనుంచి తగ్గించినట్లు గోల్డ్‌మన్ తన నివేదికలో వెల్లడించింది. బ్రెంట్‌తో పాటు డబ్ల్యుటీఐ క్రూడ్ అంచనాలను కూడా గోల్డ్‌మన్ తగ్గించింది. డబ్ల్యుటీఐ క్రూడాయిల్ ధర ఏడాది అంచనాను 64.5 డాలర్ల నుంచి 55.50 డాలర్లకు తగ్గిస్తున్నట్లు తెలిపింది. మరో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు సొసైటి జెనరల్ సైతం క్రూడాయిల్ ఏడాది ఎస్టిమేషన్స్‌ను తగ్గించింది. బ్రెంట్ ధర అంచనాను 64.25 డాలర్లకు, డబ్ల్యుటీఐ క్రూడ్ ధర అంచనాను 57.25 డాలర్లకు తగ్గించింది. గతేడాది చివరలో ఒపెక్ క్రూడాయిల్ ఉత్పత్తి భారీగా పెరగడంతో ఈ ఏడాది సరఫరా మిగులు ఉండొచ్చని బ్రోకరేజ్‌ల అంచనా. దీంతో పాటు యూఎస్ పెర్మైన్ బేసిన్‌లో పైప్‌లైన్ ఇబ్బందులు అనుకున్న సమయం కన్నా ముందే ముగిసిపోతాయని గోల్డ్‌మన్ అభిప్రాయపడింది. బ్రెజిల్, కెనెడాల్లోని బడా ఆయిల్ ప్రాజెక్టులు ఈ ఏడాది పూర్తయి ఉత్పత్తి ఆరంభించనున్నాయి. ఇవన్నీ కలిసి అంతర్జాతీయ మార్కెట్లో చమురు సరఫరాను మరింత పెంచుతాయి. ఈ ఏడాది చమురు మార్కెట్లో కనిష్ఠ మార్జినల్ ధరలు బాలెన్స్ అవుతాయని, సరఫరా మిగులు, షేల్ గ్యాస్ ఉత్పత్తి పెరగడమే ఇందుకు కారణాలని గోల్డ్‌మన్ ప్రతినిధి డామియన్ కార్వాలిన్ చెప్పారు. గత సంవత్సరం అక్టోబర్‌లో దాదాపు 90 డాలర్లను సమీపించిన క్రూడాయిల్ ధర డిసెంబర్ నాటికి సగానికి పడిపోయి 50 డాలర్లకు అటుఇటుగా ట్రేడవుతోంది. యూఎస్, చైనా వాణిజ్యయుద్ధ భయాలతో ప్రపంచ ఎకానమీలో జోరు తగ్గిన కారణంగా చమురు ధరలు ఉన్నట్లుండి పడిపోయాయి. ఈ భయాలకు లిక్విడిటీ కొరత, వడ్డీరేట్ల పెంపు ఆజ్యం పోశాయి. దీంతో క్రూడాయిల్ భారీగా క్షీణించింది. ఈ పతనం చాలా ఎక్కువగా జరిగిందని బ్రోకింగ్‌సంస్థలు అభిప్రాయపడ్డాయి. ప్రపంచ ఎకానమీ వృద్ధి అంచనాలు 3.5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో ఆయిల్‌మార్కెట్లు దీన్ని ప్రైస్‌ఇన్ చేసి ఉంటాయని అంచనా వేశాయి. అందువల్ల ఇకమీదట చమురు ధరలు కాస్తంత రికవరీ కావచ్చని తెలిపాయి. ప్రపంచ వృద్ధి 2.5 శాతాని కన్నా దిగువకు వస్తే మాత్రం ముడి చమురు ధరల్లో మరో పతనం ఉంటుదని హెచ్చరించాయి.



పెద్ద కంపెనీల్లో భారీ నష్టాలు

- **గత వారం కోల్పోయిన పెట్టుబడులు 38 వేల కోట్లు**

ముంబై: సెన్సెక్స్‌లోని టాప్ పది బ్లూచిప్ కంపెనీల మార్కెట్ విలువలు గతవారంలో 38వేల కోట్లకుపైబడి నష్టపోయాయి. మొత్తం ఆరు కంపెనీల్లో మార్కెట్ విలువలు గణనీయంగా పడిపోయినట్లు సెన్సెక్స్ గణాంకాలు చెపుతున్నాయి. ఆరుకంపెనీల్లోను రూ. 38,152.86 కోట్ల మార్కెట్ విలువలు ఆవిరి అయ్యాయి. అన్నింటికంటే రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా నష్టపోయింది. టిసిఎస్, రిల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, హిందూస్థాన్ యూనిలీవర్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి సంస్థలు నష్టాల్లో తేలాయి. ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, కోటక్ మహీంద్ర బ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకులు లాభాల్లో ముగిసాయి. రిలయన్స్ మార్కెట్ విలువలు 16,955.65 కోట్ల రూపాయలు క్షీణించి రూ.6,96,639.64 కోట్లకు చేరింది. హిందూస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువలు 8626.12కోట్లు క్షీణించి రూ.3,85,361.63 కోట్లకు చేరాయి. టిసిఎస్ రూ. 8198.96 కోట్లమేర క్షీణించి రూ.7,03,178.13 కోట్లకు పడిపోయింది. హెచ్‌డిఎఫ్‌సి విలువలపరంగా 1501.96 కోట్లకు క్షీణించి 3,38,933.58కోట్లకు చేరితే ఐటిసి విలువలు 1469.63 కోట్లు క్షీణించి 3,43,832.17కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి మార్కెట్ విలువలు రూ.1400.54ఓట్లు క్షీణించి రూ.5,75,922.41కోట్లకు చేరింది. అందుకుభిన్నంగా ఐసిఐసిఐబ్యాంకు 2906.87 కోట్లు క్షీణించి 2,356,444.07 కోట్లకు చేరింది. ఎస్‌బిఐ విలువలు రూ. 2722కోట్లు క్షీణించి రూ. 2,65,506.48 కోట్లకు పెరిగింది. ఇన్ఫోసిస్ 1376.12కోట్లు పెరిగి 2,88.658.41కోట్లకు నమోదైంది. కోటక్ మహీంద్ర బ్యాంకు సైతం 391 కోట్లు పెరిగి రూ.2,37,787.86 కోట్లకు చేరినట్లు బిఎస్‌ఇ గణాంకాలు చెపుతున్నాయి. ఇక సెన్సెక్స్‌లో టాప్ పది ర్యాంకులపరంగాచూస్తే టీసీఎస్ మొదటిస్థానంలో ఉంటే ఆ తర్వాతస్థానిల్లో రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, హిందూస్థాన్ యూనిలీవర్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్,ఎస్‌బిఐ, కోటక్‌మీంద్రబ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకులు నిలిచాయి. గతవారంలో సెన్సెక్స్ 381.62 పాయింట్లు క్షీణించిన సంగతి తెలిసిందే.



ఏడు దశాబ్దాల కరువు తీరింది. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి టీమిండియా చరిత్ర సృష్టించింది. మునుపటి భారత జట్ల కంటే ఇది ఉత్తమమైందన్న టీమిండియా కోచ్ వ్యాఖ్యలు నిజమయ్యాయి. నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఒకసారి తడబడినా తర్వాత పుంజుకుని అందివచ్చిన అవకాశాన్ని కోహ్లీ సేన సద్వినియోగం చేసుకుంది.

ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునేలా చేసింది. ప్రపంచంలో తమ జట్టే ఉత్తమమైందన్న కంగారూల గర్వాన్ని అణిచింది. కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా సాధించిన ఈ అపూర్వ సిరీస్ విజయం భారత క్రికెట్ చరిత్రలో కలకాలం నిలిచిపోతుంది.

బాహుబలి

7 దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయం

- చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన
- సిరీస్ ఆద్యంతం అన్ని విభాగాల్లో రాణించిన టీమిండియా
- డ్రాగా ముగిసిన చివరి టెస్టు
- నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం



సిడ్నీ: ఇది అధికారిక ప్రకటన. ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా టెస్టు సిరీస్ గెలిచి రికార్డు సృష్టించింది. నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. అయితే 3-1తో గెలవలేకపోయామన్న చిన్న అసంతృప్తి కలిగింది. చివరి టెస్టులో వరుణుడు జోక్యం చేసుకోవడంతో ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడో రోజు ఆటలో 25.5 ఓవర్లు మాత్రమే ఆడగలిగారు. సోమవారం ఉదయం నుంచి చిరు జల్లులు కురవడం, ఆకాశం నల్లటి మేఘాలతో నిండి వుండటంతో చివరి రోజు పూర్తిగా రద్దయింది. మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించే సమయానికి ఆస్ట్రేలియా ఇంకా 316 పరుగులు వెనకబడింది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచిన తొలి భారతీయుడిగా, ఆసియా తొలి కెప్టెన్‌గా ఘనత సాధించాడు. అంతేకాదు విదేశాల్లో నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను గెలిచిన కెప్టెన్‌గా కూడా కోహ్లీ రికార్డుల్లోకెక్కాడు. 1947-48 నుంచి టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనలకు వెళుతోంది. కానీ తొలిసారి టీమిండియా టెస్టు సిరీస్ గెలిచింది.



ఇక ఈ పర్యటన విషయానికొస్తే.. అడిలైడ్, మెల్‌బోర్న్ టెస్టుల్లో గెలిచిన టీమిండియాకు చివరి టెస్టులో చటేశ్వర్ పుజారా (193), రిషబ్ పంత్ (159 నాటౌట్), రవీంద్ర జడేజా (81), మయాంక్ అగర్వాల్ (77) తొలి ఇన్నింగ్స్‌లో గట్టి పునాది వేశారు. దీంతో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అయితే ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా ఏ దశలోనూ గట్టి పోటీ ఇవ్వలేక తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన కుల్‌దీప్ యాదవ్ 5 వికెట్లు తీసుకున్నాడు. మహ్మద్ షమీ (2 వికెట్లు), జస్‌ప్రీత్ బుమ్రా (1), జడేజా (2) కుల్‌దీప్‌కు మద్దతునిచ్చారు. పుజారా (521 పరుగులు) ఈ సిరీస్‌లో అత్యదిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డును అందుకున్నాడు. మరోవైపు ఈ సిరీస్‌లో 21 వికెట్లు పడగొట్టిన జస్‌ప్రీత్ బుమ్రా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. నాథన్ లియాన్‌కు కూడా 21 వికెట్ల దక్కాయి.



- (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో భారత్ సిరీస్ విజయాలను నమోదు చేసింది.

1967/68లో న్యూజిల్యాండ్‌లో 3-1 తేడాతో
1971లో ఇంగ్లాండ్‌లో 1-0 తేడాతో
1986లో ఇంగ్లాండ్‌లో 2-0 తేడాతో
2007లో ఇంగ్లాండ్‌లో 1-0 తేడాతో
2008/09లో న్యూజిలాండ్‌లో 1-0 తేడాతో
2018/19లో ఆస్ట్రేలియాలో 2-1 తేడాతో
భారత్ సిరీస్ విజయాలను సొంతం చేసుకుంది.

- **విరాట్ కోహ్లీ నాయకత్వంలో విదేశీ గడ్డపై సిరీస్ విజయాలు..**

2015లో శ్రీలంకలో 2-1 తేడాతో
2016లో వెస్టిండీస్‌లో 2-0 తేడాతో
2017లో శ్రీలంకలో 3-0తేడాతో
2018/19 ఆస్ట్రేలియాలో 2-1 తేడాతో

ఆస్ట్రేలియాలో పర్యాటక జట్లు నమోదు చేసిన సిరీస్ విజయాలు : ఇంగ్లాండ్ రికార్డు స్థాయిలో 13 సార్లు ఆసీస్ గడ్డపై సిరీస్ విజయాలు నమోదు చేయగా.. విండీస్ నాలుగు సార్లు గెలుపొందింది. దక్షిణాఫ్రికా మూడు సార్లు, న్యూజిలాండ్, భారత్ ఒక్కోసారి సిరీస్ విజయాలను నమోదు చేశాయి.

మేము సరైన టెస్టు క్రికెట్ ఆడాం: రవిశాస్త్రి

టీమిండియా కోచ్ రవిశాస్త్రి తన నమ్మకాన్ని ఆయుధంగా మార్చి విమర్శకులపైకి ఎక్కుపెట్టాడు. మునుపటి జట్ల కంటే ఈ జట్టు ఉత్తమమైందని గతంలో చేసిన వ్యాఖ్యలకు నలువైపుల నుంచి విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియాపై చారిత్రక టెస్టు సిరీస్ విజయం తర్వాత శాస్త్రి మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్‌తో పాటు విమర్శలకులపై విరుచుకుపడ్డారు. 'నేను మెల్‌బోర్న్‌లోనే చెప్పాను. నేనేదో ఉత్తుత్తి మాటలు చెప్పినట్టు జనాలు అనుకున్నారు. కానీ నేను అప్పుడు చెప్పింది జోక్ కాదు. ఎందుకంటే కుర్రాళ్లు ఎంతగా శ్రమిస్తున్నారో నాకు తెలుసు. అక్కడ మొదలైన ఆ ఫైర్ దక్షిణ అర్ధగోళాన్ని దాటింది. ట్రేసర్ బుల్లెట్‌గా గాలిని చీల్చుకుంటూ వెళ్లింది. గతంలోని భారత జట్లన్నిటికంటే ఇది ఉత్తమమైన జట్టు. మాది సరైన టెస్టు జట్టు అని సగర్వంగా చెప్పొచ్చు. ఈ గెలుపు కోసం దాదాపు 12 నెలల నుంచి శ్రమిస్తున్నాం. ప్రతి ఆటగాడు కష్టపడుతున్నాడు. ఇప్పుడు నాకు సంతృప్తిగా ఉంది. 1983 ప్రపంచ కప్ కంటే, 1985 వరల్డ్ చాంపియన్‌షిప్ కంటే ఇది ఎంతో గొప్ప విజయం' అని శాస్త్రి అన్నారు.

ప్రధాని మోడీ ప్రశంసలు

ఆస్ట్రేలియాలో చరిత్రాత్మక టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీ సేనను భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. 'ఆస్ట్రేలియాలో చరిత్రాత్మక క్రికెట్ విజయాన్ని సాధించిన భారత క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు. శ్రమించి పోరాడిన మీరు ఈ గెలుపుకు అర్హులు. చిరస్మరణీయ ప్రతిభకు ఈ సిరీస్ నిదర్శనం. అసాధారణమైన టీమ్ వర్క్. భవిష్యత్ మ్యాచ్‌లకు నా బెస్ట్ విషెస్' అని ట్విట్టర్‌లో మోడీ పేర్కొన్నారు. చరిత్ర సృష్టించిన కోహ్లీ సేనకు మరికొంత మంది అభినందనలు తెలిపారు.

కోహ్లీకి అనుష్క స్పెషల్ మెసేజ్



ఆస్ట్రేలియాలో టీమిండియా సాధించిన చరిత్రాత్మక టెస్టు విజయంపై బాలీవుడ్ ప్రశంసల వర్షం కురిపించింది. అయితే టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మ మాత్రం 'మై లవ్' అని సంభోదిస్తూ ప్రత్యేక మెసేజ్ పెట్టింది. 'వాళ్లు వచ్చారు. చితగ్గొట్టారు!! చరిత్ర నెలకొంది. అది సృష్టించింది ఈ జట్టే. ఆటగాళ్లందరికీ, కోచింగ్, సపోర్ట్ స్టాఫ్‌కు శుభాకాంక్షలు. ఏది ముఖ్యమైనదన్న దానిపై దృష్టి పెట్టేందుకు ఈ విజయం నమ్మకాన్ని కలిగిస్తుంది. మిగతా వాటన్నింటిని పక్కన పెట్టండి. సో సో హ్యాపీ అండ్ ప్రౌడ్ ఆఫ్ మై లవ్ విరాట్ కోహ్లీ' అని అనుష్క ట్విట్టర్‌లో పేర్కొంది. ఇక బాలీవుడ్‌లోని ఇతరుల విషయానికొస్తే.. అరుణ్ ధావన్ 'ఆస్ట్రేలియాలో చరిత్రాత్మక విజయం. వెల్ డన్. జై హింద్ ఇండియా' అనుపమ్ ఖేర్: డియర్ విరాట్ కోహ్లీ అండ్ గ్రేట్ ఇండియన్ టీమ్ జిందాబాద్. ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లు మీరే. ఈ విజయం సాధించినందుకు కృతజ్ఞతలు. జై హింద్, జై హో'. ఫర్హా అఖ్తర్: ఎట్టకేలకు ఆసీస్ అడ్డంకులను ఛేదించి తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన విరాట్ కోహ్లీకి, టీమిండియాకు శుభాకాంక్షలు'. ప్రీతి జింటా: ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా నిలిచిన బాయ్స్ ఇన్ బ్లూకు శుభాకాంక్షలు. చటేశ్వర్ పుజారా ప్రతిభ అద్భుతం'.

'ఆస్ట్రేలియాలో కొన్ని వారాలుగా జరుగుతున్న సంఘటనలు ఇప్పుడు చరిత్రాత్మకంగా మారాయి. టీమిండియా శ్రమించిన ప్రతి క్షణానికి తగిన ప్రతిఫలం లభించింది. మాపై ప్రేమాభిమానాలను కురిపించిన అందరికీ కృతజ్ఞతలు. పట్టరాని సంతోషంతో ఉన్నాం. నా శేష జీవితమంతా ఈ జ్ఞాపకాలతో జీవిస్తాను' అని చటేశ్వర్ పుజారా అన్నాడు. మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ స్పందిస్తూ.. 'అసాధారణ విజయం. దీని కోసం ప్రతి ఒక్కరూ శ్రమించారు. ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేయండి. టీమిండియాలోని ప్రతి సభ్యుడికి నా శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఇక హర్భజన్ సింగ్ స్పందిస్తూ.. 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన మిమ్మల్ని చూసి గర్విస్తున్నాం. బాగా ఆడారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలిచిన చటేశ్వర్‌కు శుభాక్షాంక్షలు. భారత బ్యాటింగ్ లైనప్‌కు నువ్వు వెన్నెముకలా నిలిచావు. కీప్ ఇట్ అప్ బీసీసీఐ. బౌలింగ్ విషయంలో జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతం' అని రాశాడు. సురేష్ రైనా కూడా స్పందించాడు. 'ఆస్ట్రేలియాలో చరిత్రాత్మక టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియాకు శుభాక్షాంక్షలు' అని పేర్కొన్నాడు.

కోహ్లీసేనపై ప్రశంసల వర్షం

టీమిండియా సరికొత్త చరిత్రను లిఖించింది. ఆస్ట్రేలియాపై 2-1 తేడాతో చారిత్రక సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. చివరిదైన నాలుగో టెస్టు వర్షం కారణంగా డ్రాగా ముగియడంతో 2-1 తేడాతో ఈ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవాలన్న ఏడు దశాబ్దాల కల నెరవేరడంతో క్రికెట్, సినీ, రాజకీయ ప్రముఖులు కోహ్లీసేనపై ట్విటర్‌లో ప్రశంసల వర్షం కురిపించారు. ఆస్ట్రేలియా గడ్డపై అద్భుతంగా రాణించిన కోహ్లీసేనకు భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

- 'ఆస్ట్రేలియాలో తొలిసారిగా టెస్టు సిరీస్‌ను గెలిచినందుకు కోహ్లీ సేనకు శుభాభినందనలు. టీమిండియా ఆల్‌రౌండ్ ప్రతిభ మమ్మల్ని గర్వపడేలా చేసింది. దీన్నే అనుసరించండి' **-రామ్‌నాథ్ కోవింద్, భారత రాష్ట్రపతి**
- 'భారత్ క్రికెట్ చరిత్రలో మర్చిపోలేని రోజు. పట్టుదలతో టీమిండియా ఆటగాళ్లు ఈ సిరీస్‌ను సాధించారు. మిమ్మల్ని చూస్తే గర్వంగా ఉంది' **-సచిన్ టెండూల్కర్**
- 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది.' **-ఐసీసీ**
- 'మరిచిపోలేని ఈ విజయాన్ని అందించిన టీమిండియాకు అభినందనలు. భారత్‌లోని ప్రతి క్రికెట్ అభిమాని గర్వపడుతున్నాడు. టీమిండియా సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైంది. **-వీరేంద్ర సెహ్వాగ్**
- 'టీమిండియా అద్భుతంగా ఆడింది. మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా. భారత బ్యాటింగ్ లైనప్‌కి వెన్నెముకగా నిలిచిన పుజారాకు అభినందనలు. బుమ్రా బౌలింగ్ సూపర్' **- హర్భజన్ సింగ్**
- 'తొలిసారిగా ఆసీస్‌లో సిరీస్ నెగ్గిన టీమిండియాకు అభినందనలు. మీ ప్రదర్శన ఎంతో నచ్చింది' **-మిచెల్ జాన్సన్, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్**
- 'ఈ చారిత్రక విజయం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసింది' **-మహ్మద్ కైఫ్**
- 'కెప్టెన్ కోహ్లీకి అభినందనలు. టీమిండియా బాగా ఆడింది' **- అమిత్ మిశ్రా**
- 'బాగా ఆడారు. టీమిండియాకు అభినందనలు' **-శివరాజ్‌సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి**

దశాబ్దాల కోరిక నెరవేరింది

ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలవాలన్న ఏడు దశాబ్దాల కోరిక నెరవేరింది. విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచింది, సిడ్నీలో జరిగిన చివరి, నాల్గో టెస్టు ప్రతికూల వాతావరణం కారణంగా డ్రాగా ముగిసింది. దీంతో బోర్డర్-గవాస్కర్ సిరీస్‌ను కోహ్లీ సేన 2-1తో కైవసం చేసుకుంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం లాలా అమర్‌నాథ్ నేతృత్వంలోని టీమిండియా 1947-48లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన తర్వాత భారత జట్టుకు ఇది తొలి సిరీస్ విజయం. ఆ పర్యటనలో సర్ డాన్ బ్రాడ్‌మన్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టుతో టీమిండియా తలపడింది. 'మొదటిగా నేను చెప్పదలచుకున్నదేంటంటే.. గతంలో టీమిండియాలో ఉన్నప్పుడు ఇంతగా ఎన్నడూ గర్వపడలేదు. ఒక సంప్రదాయాన్ని నిర్మించాం.. నేను కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్న ఇక్కడే మా జట్టు పరివర్తన చెందడం మొదలైంది. నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడే టెస్టు సిరీస్ గెలవడాన్ని నమ్మలేకపోతున్నా. ఒక్కమాట మాత్రం చెప్పాలనుకుంటున్నా.. ఈ జట్టుకు కెప్టెన్ అయినందుకు ''గర్వంగా'' ఉంది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. సహచరులందరూ కలిసి నన్ను మంచి కెప్టెన్‌ను చేశారు' అని మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ కోహ్లీ అన్నాడు.

ఈ సిరీస్ గెలుపు తమకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని భారత జట్టు కెప్టెన్ చెప్పాడు. 'ఈ సిరీస్ విజయం భారత క్రికెట్ జట్టుకు ప్రత్యేక గుర్తింపు తెస్తుందని భావిస్తున్నాను. అనేకమంది వర్ధమాన క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాము' అని అన్నాడు. నిజానికి ఈ సిరీస్‌ను 3-1తో గెలిచి అవకాశముండింది. కానీ చివరి, నాల్గో టెస్టు చివర్లో ప్రతికూల వాతావరణం వల్ల ఈ మ్యాచ్‌ను గెలిచే అవకాశం చేజారింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగులు చేయడంతో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు 30 ఏళ్ల తర్వాత తొలిసారి ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. ప్రెజెంటేషన్ సెరిమనీలో ఇండియా, ఆస్ట్రేలియా అభిమానులు కోహ్లీ సేనకు మద్దతుగా కేకలు వేయడం చూస్తుంటూ టీమిండియాకు అరుదైన గౌరవ వందనం లభించినట్టయింది. 'ఒక చరిత్ర నెలకొంది. భారత క్రికెట్‌లో ఇది అరుదైన సంఘటన' అని భారత క్రికెట్ దిగ్గజ ఓపెనర్ సునీల్ గవాస్కర్ అన్నారు. ఒకవేళ ప్రతికూల వాతావరణం లేకుంటే, రోజంతా ఆట జరిగివుంటే చివరి, నాల్గో టెస్టును కూడా టీమిండియా గెలిచేది. దీంతో ఆస్ట్రేలియాలో ఒకే సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్ కైవసం చేసుకున్న జట్టుగా కూడా టీమిండియా రికార్డుల్లోకెక్కేది.

కెరీర్‌లో ఇది గొప్ప విజయం: కోహ్లీ

విరాట్ కోహ్లీ 2011 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడు. కానీ తొలిసారి తన నేతృత్వంలోని టీమిండియా ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను గెలవడంతో కోహ్లీ భావోద్వేగానికి గురయ్యాడు. తన కెరీర్‌లోనే ఇది గొప్ప విజయంగా కోహ్లీ అభివర్ణించాడు. '2011 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో నేను కూడా ఉన్నాను. కానీ గతంలో వరల్డ్ కప్ గెలిచినప్పుడు గానీ, హోం సిరీస్‌లు గెలిచినప్పుడు గానీ నేను ఇంత భావోద్వేగానికి గురికాలేదు. అయితే ఏది అత్యంత భావేద్వేగ సందర్భమేదని మీరు నన్నిడిగితే.. ఇదే అని చెబుతాను. ఎందుకంటే నేను ఇక్కడికి రావడం మూడోసారి. ఎందుకంటే ఇక్కడ సిరీస్ గెలవడం ఎంత కష్టమో నేను ఫీల్డింగ్‌లో ఉండి స్వయంగా తెలుసుకున్నాను. ఆ రకంగా చూస్తే ఇది అత్యంత భావోద్వేగ సందర్భం ఇదే. చరిత్ర అనేది అనేక విషయాలను తెలియజేస్తుంది. ఇది గర్వించదగ్గ సందర్భమనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందుకంటే గత 12 నెలలుగా మేము ఎంతో శ్రమిస్తున్నాం. చరిత్ర సృష్టించిన దానికంటే మా కష్టానికి ఫలితం దక్కినందుకు చాలా సంతృప్తిగా ఉన్నా' అని కోహ్లీ అన్నాడు. జట్టుకు సహకారమందించే విషయంలో హనుమ విహారికి నా మద్దతు తెలుపుతానని భారత జట్టు కెప్టెన్ అన్నాడు. ఎందుకంటే ఒక సెంచరీ చేయడం కంటే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో కొత్త బంతితో 70 బంతులు ఆడటం చాలా గొప్ప విషయమని చెప్పాడు.

మునుపటి జట్ల కంటే ఇది ఉత్తమమైన జట్టు: పుజారా

ఆసీస్‌లో పర్యటించిన మునుపటి జట్ల కంటే ఇప్పుడున్న టెస్టు జట్టు ఎంతో ఉత్తమమైనది అని టీమిండియా నయావాల్ చటేశ్వర్ పుజారా పేర్కొన్నాడు. నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నయావాల్ 74 సగటుతో 521 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డుని గెలుచుకున్నాడు. ' ఈ విజయంతో మేమంతా చాలా గర్వంగా ఉన్నాం. ఈ సిరీస్‌ను గెలవటానికి మేము ఎంతో కష్టపడ్డాం. ఇటువంటి ఉత్తమమైన జట్టులో నేను కూడా భాగమైనందుకు సంతోషంగా ఉంది. మా జట్టుకు కంగ్రాచుల్యేషన్' అని మ్యాచ్ అనంతరం పుజారా అన్నాడు. అంతేకాకుండా ఈ విజయం క్రెడిట్ అంతా బౌలర్లదే అని చటేశ్వర్ తెలిపాడు. ' మేము నలుగురు బౌలర్లతో బరిలోకి దిగాం. 20 వికెట్లు తీయడం అంటే మామూలు విషయం కాదు. ఈ క్రెడిట్ అంతా మా బౌలర్లకే దక్కుతుంది' అని పుజారా వివరించాడు. ' తర్వాత ఆడబోయే టెస్టు సిరీస్‌కు ఇంకా 6-7 నెలల సమయం ఉంది. ప్రిపేర్ అవ్వటానికి నాకు కాస్త సమయం దొరికింది. నాకు వైట్‌బాల్‌తో ఆడాలని ఉంది. కానీ నేను టెస్టు క్రికెట్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తాను' అని పుజారా ముగించాడు.



తొలి ఆసియా కెప్టెన్‌గా ఘనత

కోహ్లీ సేన భారత టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపైనే మట్టికరిపించి తన సత్తాను క్రికెట్ ప్రపంచానికి చాటింది. ఆస్ట్రేలియాలో తొలి సిరీస్ విజయాన్ని నమోదు చేసి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. ఈ విజయంతో భారత అభిమానుల చిరకాల స్వప్నం నెరవేరింది. ఈ సిరీస్ విజయంతో భారత్ మరికొన్ని మైలురాళ్లను చేరుకుంది. ఆ విశేషాలెంటో చూద్దాం...

- 72 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై భారత్‌కు తొలి సిరీస్ విజయమిది. గతంలో 1980-81, 1985-86, 2003-04 పర్యటనల్లో భారత్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 47 టెస్టుల్లో భారత్‌కు 7 విజయాలు దక్కాయి.
- ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్ విరాట్ కోహ్లీనే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.